విషయంలో విదేశీయులు, రోహింగ్యాలు, బంగ్లాదేశీ చొరబాటుదారుల అంశాన్ని రామచందర్ రావు బలంగా లేవనెత్తారు. దేశ భద్రత దృష్ట్యా కూడా ఓటరు జాబితా శుద్ధీకరణ ఎంతో కీలకమైన అంశం. భారత ఓటరు జాబితాలో అక్రమ చొరబాటుదారులకు చోటు ఉండేలా చూడడం దేశానికి ముప్పుగా పరిణమిస్తుంది. ఇటువంటి వ్యక్తుల ఓట్లు ప్రజాస్వామ్య తీర్పును ప్రభావితం చేసే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. స్వదేశీయులకు మాత్రమే ఓటు హక్కు ఉండాలన్నది బీజేపీ ప్రాథమిక నినాదం. ఈ నినాదంతోనే తాము ఈ ప్రక్రియను సమర్థిస్తున్నామని, దీన్ని కేవలం ఒక రాజకీయ కార్యక్రమంగా చూడవద్దని ఆయన హితవు పలికారు. ప్రతి బూత్ స్థాయిలో ఉన్న బీఎల్ఏ2 ప్రతినిధులు, బీజేపీ కార్యకర్తలు ఈ ప్రక్రియలో అత్యంత కీలకంగా మారాలి. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎస్ఐఆర్ గురించి వివరించాలి. ప్రజల సందేహాలను నివృత్తి చేయడం కార్యకర్తల తక్షణ కర్తవ్యం. ఎవరైనా ఇబ్బంది పడుతుంటే వారికి సహాయం అందించడం ద్వారా ప్రజలకు పార్టీని మరింత దగ్గర చేయవచ్చు. కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకం కావాలి. 10 మందికి ఓటర్ల జాబితాలో పేరు ఉందో లేదో సరిచూసుకోవడంలో సహాయపడితే, ఆ కుటుంబం పార్టీకి అండగా నిలుస్తుందని ఆయన సూచించారు. శుభ్రమైన ఓటరు జాబితానే బలమైన ప్రజాస్వామ్యానికి పునాది అని రామచందర్ రావు వ్యాఖ్యానించారు. నకిలీలు లేని జాబితా వచ్చినప్పుడే నిజమైన ప్రజా తీర్పు వెలువడుతుంది. ఒకే వ్యక్తికి 2 లేదా 3 చోట్ల ఓట్లు ఉండడం ప్రజాస్వామ్యానికి మచ్చగా ఆయన పేర్కొన్నారు. దీనివల్ల ఎన్నికల ఫలితాలు తారుమారయ్యే అవకాశం ఉందన్న విషయాన్ని కార్యకర్తలు గుర్తుంచుకోవాలి. 100 శాతం పారదర్శకత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగానే ఈ శుద్ధీకరణ జరుగుతోందని ప్రజలకు వివరించాలి. తద్వారా ప్రతిపక్షాలు సృష్టిస్తున్న అపోహలను పటాపంచలు చేయాలి. ఎస్ఐఆర్ అంటేనే ఓటరు జాబితా శుద్ధీకరణ మరియు నవీకరణ. ఇది ఒక నిరంతర ప్రక్రియ. ఎప్పటికప్పుడు జాబితాను సరిచేయడం వల్ల ఎన్నికల సమయంలో ఎలాంటి పొరపాట్లు జరగవు. 18 ఏళ్లు నిండిన ప్రతి యువకుడు ఓటు నమోదు చేసుకునేలా చూడాలి. అదే సమయంలో మరణించిన వారి పేర్లను తొలగించాలి. ఈ బాధ్యతను పార్టీ కార్యకర్తలు భుజాన వేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. 5 సంవత్సరాల కాలపరిమితిలో చాలా మార్పులు జరుగుతుంటాయి. వీటిని గమనించి ఓటరు జాబితాను అప్‌డేట్ చేయడం ద్వారానే దేశ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలు పారదర్శకంగా జరుగుతాయని ఆయన వివరించారు. ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టడంలో కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను ఖండించాలి. వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలి. నాగోల్ సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలందరూ ఉత్సాహంగా ఈ ప్రచారంలో పాల్గొనాలని ఆయన కోరారు. రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ప్రతి బూత్ సందర్శన జరగాలి. ఏ ఒక్క అర్హత కలిగిన ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అక్రమ ఓట్ల తొలగింపు విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బలమైన ఓటరు జాబితాతోనే రాబోయే ఎన్నికల్లో ఘనవిజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. భారతదేశ ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడడంలో బీజేపీ ఎల్లప్పుడూ ముందుంటుంది. ఓటు అనేది పవిత్రమైన హక్కు. ఆ హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత. అనర్హుల ఓట్ల వల్ల నిజమైన ఓటర్ల హక్కు కాలరాయబడుతోంది. ఈ అన్యాయాన్ని అరికట్టేందుకే ఎన్నికల సంఘం ఈ చర్యలు తీసుకుంది. దీనిని స్వాగతించాల్సింది పోయి, రాజకీయ పార్టీలు అడ్డుకోవడం వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. ప్రజలు వాస్తవాలను గమనించి ప్రతిపక్షాల మాటలను నమ్మవద్దని రామచందర్ రావు కోరారు. మనందరం కలిసి ఈ ఓటరు జాబితా శుద్ధీకరణను విజయవంతం చేద్దామని ఆయన ఉద్ఘాటించారు.

## జిల్లాలో 20 వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు

**ప్రభుత్వ విప్,విజయరమణ రావు.. వానాకాలం సీజన్లో జిల్లాలో 27,500 ఎకరాల అంచనా**



**విశాలభారతి, పెద్దపల్లి:** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల మరియు జిల్లా వ్యవసాయ అధికారులతో వానాకాలం సీజన్ దృష్ట్యా పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించిన ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ విప్ విజయరమణ రావు మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రారంభమైన వర్షాకాలం సీజన్లో పంటల సాగు వివరాలు, యూరియా అవసరం మరియు ప్రస్తుత నిలువలు, యూరియా బుకింగ్ యాప్ ప్రారంభం గురించి వ్యవసాయ అధికారులతో చర్చించడం జరిగిందని అన్నారు.జిల్లాలో ప్రస్తుత వానకాలం సీజన్లో 27,500 ఎకరాల పంట అంచనాలకు గాను ఎలినో ప్రభావంతో వరి పంట సాగు తగ్గిపోయే అవకాశం ఉందని జూలై మొదటి వారం లోపు పంట వివరాలను సమర్పించాలని అధికారులకు సూచనలు చేశారు.జిల్లాలో 20 వేల మెట్రిక్ టన్నుల యూరియా నిలువలు ఉందని జిల్లాలో తగ్గుతున్న సాగుకు అనుకూలంగా యూరియా బస్తాలు ఉంటాయని, యూరియా కొరత అనే అంశానికి తావు లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈనెల 20 వ తేదీన యూరియా బుకింగ్ యాప్ ను ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. వర్షాకాలంలో పంటలకు అవసరమైన సాగునీటి సరఫరా విషయంలో ఎలాంటి సందేహాలు లేవని నిండుగా సాగునీటి సరఫరా ఉంటుందని తెలిపారు.ఈ సమీక్షా సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, మండల వ్యవసాయ అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒక వ్యక్తికి 07 రోజుల జైలు శిక్ష




**విశాలభారతి, గోదావరిఖని:** రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బి . రాజేశ్వరరావు ఆధ్వర్యంలో డ్రంక్&డ్రైవ్ లో దొరికిన ఆరు గురు వ్యక్తులకు, ప్రిన్సిపల్ కోర్టు మేజిస్ట్రేట్ గోదావరిఖని, వెంకట్ సచిన్ రెడ్డి ముందు ఆరు గురుని హాజరుపరుచగా ఐదుగురి కి 55000 రూపాయల ఫైన్ వేయడం జరిగింది మరొక వ్యక్తి కి ఏడు రోజుల జైలు శిక్ష విధించారు. వీరిని కరీం నగర్ జిల్లా జైలుకు తరలించడం జరిగింది. సీఐ మాట్లాడుతూ వాహనం మద్యం తాగి వాహనం నడప రాదని నడిపినచో వారిపై చట్టరీత్యా చర్య తీసుకోవడం జరుగుతుంది . మరియు వాహనానికి సంబంధించిన పత్రములు మరియు టూ వీలర్ వెహికల్స్ నడిపేవారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని మరియు రాంగ్ రూట్లో వెళ్లరాదని ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వాహనాన్ని అతివేగంగా నడపరాదని సిఐ తెలియజేయడం జరిగింది.

## విశాల భారతి కథనానికి స్పందించిన మున్సిపల్ కమిషనర్

**మొహరం ఏర్పాట్లు, పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు**




విశాల భారతి కథనానికి స్పందించిన మున్సిపల్ కమిషనర్
- 6వ వార్డులో సమస్యలపై ప్రత్యేక పరిశీలన
- కమిషనర్‌కు సమస్యలు వివరించిన షేక్ ఖాదర్ బాబా, గ్రామ ప్రజలు.
- షేక్ ఖాదర్ బాబా విజ్ఞప్తితో కదిలిన అధికారులు.
- మొహరం ఏర్పాట్లు, పారిశుద్ధ్య సమస్యలపై కమిషనర్ హామీ.
- ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు: మున్సిపల్ కమిషనర్

Main Edition Page 7 19 Jun 2026
For Advertisement Call +91 99121 62531

**మహబూబాబాద్ విశాల భారతి:** విశాల భారతి పత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన మున్సిపల్ కమిషనర్, పట్టణంలోని 6వ వార్డులో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించారు. మొహరం సందర్భంగా పీర్ల కొట్టం ప్రాంతంలో జరుగుతున్న ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి అవసరమైన పనులను వేగవంతం చేశారు. స్థానిక నాయకుడు షేక్ ఖాదర్ బాబా చేసిన విజ్ఞప్తికి స్పందించిన అధికారులు, మొహరం ఉత్సవాల నిర్వహణకు అవసరమైన సౌకర్యాల కల్పనతో పాటు పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. గ్రామంలోని కొన్ని ప్రాంతాల్లో తాగునీటి పైపులు పగిలిపోవడంతో వెంటనే స్పందించిన మున్సిపల్ కమిషనర్, మరమ్మతు పనులు చేపట్టి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మొహరం ఏర్పాట్లకు సహకరించిన మున్సిపల్ కమిషనర్‌కు, అలాగే 6వ వార్డు కౌన్సిలర్ భూక్య బుజ్జి రాంజి నాయక్ కు ముస్లిం సోదరులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ జావిద్, షేక్ ఖాజీ, షేక్ జానీ, షేక్ సోహెల్, షేక్ మున్నా తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించిన మాజీ మంత్రి



**మహబూబాబాద్ విశాలభారతి:** డోర్నకల్ నియోజకవర్గంలోని సీరోల్ మండలం వస్రాం తండాకు చెందిన మాజీ ఎంపీటీసీ బాణోత్ వీరన్న తల్లి ధర్మి అనారోగ్యానికి గురై మహబూబాబాద్‌లోని కార్తిక్ (నెహ్రూనాయక్) ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్ శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు. ఈ సందర్భంగా ధర్మి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న సత్యవతి రాథోడ్, వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామానికి చెందిన గండి వెంకటయ్య కూడా అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో వస్రాం తండా సర్పంచ్ బాణోత్ కల్యాణి దేవేందర్, కౌసల్యాదేవిపల్లి సర్పంచ్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, బండ బిక్షం రెడ్డి, బొడ శ్రీను నాయక్, గ్రామ పార్టీ మాజీ అధ్యక్షుడు కర్ణావత్ దాస్రు, వీరన్న, బాలాజీ, బొమ్మకంటి వెంకట్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**దేవరుప్పుల, విశాలభారతి:** టిపిసిసి ఉపాధ్యక్షురాలు హనుమండ్ల ఝాన్సీరెడ్డి,పాలకుర్తి నియోజకవర్గ శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి ఆదేశాల మేరకు దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ ఆధ్వర్యంలో దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా కేకును కోసి ఘనంగా జన్మదిన వేడుకలను జరుపుకున్న మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కాసారపు ధర్మారెడ్డి, మైనారిటి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు మహ్మద్ రసూల్,భూక్య సజ్జన్ నాయక్,ఎన్ఎస్ యుఐ మండల అధ్యక్షుడు కొంగరి ఉమేష్,మాజీ ఎంపిటిసి ఎండి జాకీర్,మండల నాయకులు దావేర అనిల్,పడమటి తండా సర్పంచ్ జాటోత్ నవీన్,బానోత్ రామచంద్రు, రెడ్డి రాజుల రమేష్,దౌపతి నర్సయ్య,లావుడియ రవి,భూక్యా మల్లేష్,బుర్ర ప్రభాకర్,మంద అశోక్, ఎల్మకంటి నర్సింహా,వంగల అనిల్,దావేర శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




# భూమి వివాదంపై తప్పుడు ప్రచారాలు నమ్మవద్దు

- అన్ని స్థాయిల్లో విచారణలు పూర్తయ్యాయి
- ఆరోపణలు నిరాధారమని బాధితుల వివరణ
- బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరిక

**కురవి విశాల భారతి :**



మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రానికి చెందిన వ్యవసాయ భూముల విషయంలో కొందరు వ్యక్తులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని బాధితులు కోరారు. ఈ మేరకు వారు వివరాలను వెల్లడించారు. వారి కథనం ప్రకారం, కురవి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 161/ఎలో 2 ఎకరాలు, 283/బిలో 1 ఎకరం 20 గుంటల భూమిని గుమ్మల్ల వెంకటేశ్వర్లు కొన్నేళ్ల క్రితం ఓ గిరిజన వ్యక్తి నుంచి కొనుగోలు చేసి తన భార్య అరుణ పేరుపై రిజిస్ట్రేషన్ చేయించారు. అనంతరం అరుణ ఇంటి నుంచి వెళ్లిపోవడంతో ఆమె ఆచూకీ లభించకపోవడంతో రెవెన్యూ నిబంధనల ప్రకారం భూమిని తన పేరుపై మార్చాలని వెంకటేశ్వర్లు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు మేరకు అప్పటి తహసీల్దార్ కార్యాలయం, కురవి గ్రామ పంచాయతీ కార్యాలయ నోటీస్ బోర్డులపై నోటీసులు ప్రదర్శించి, ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ప్రకటించారు. 45 రోజుల గడువు పూర్తయ్యే వరకు ఎలాంటి అభ్యంతరాలు రాకపోవడంతో భూమిని వెంకటేశ్వర్లు పేరుపై మ్యూటేషన్ చేసినట్లు తెలిపారు. అనంతరం వెంకటేశ్వర్లు పేరుపై ఉన్న భూమిని ఎర్ర నాగేశ్వరరావు గ్రామ పెద్దలు, వెంకటేశ్వర్లు బంధువుల సమక్షంలో అప్పటి మార్కెట్ ధర ప్రకారం కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఈ భూమికి ఎలాంటి సంబంధం లేని వ్యక్తులు అప్పటి ఆర్డీవోకు ఫిర్యాదు చేయగా, ఆర్డిఓ వెంకటేశ్వర్లు కు ఉన్న పాస్బుక్కులు రద్దు చేసి తహసీల్దార్ ఎంక్వయిరీ చేసి ఎవరికి కరెక్ట్ ఉంటే వారికే పాసుబుక్కులు ఇష్యూ చేయమని ఆర్డర్ ఇవ్వడం జరిగింది. ఆర్డీవో ఉత్తర్వులపై ఎర్ర నాగేశ్వరరావు అప్పటి ఉమ్మడి వరంగల్ జిల్లా జాయింట్ కలెక్టర్ (జెసి కోర్ట్) ను ఆశ్రయించగా, పూర్తి రికార్డులను పరిశీలించిన జేసీ భూమిపై ఫిర్యాదు చేసిన వ్యక్తికి ఎలాంటి సంబంధం లేదని తేల్చి, ఆర్డీవో ఉత్తర్వులను రద్దు చేస్తూ నాగేశ్వరరావుకు పాస్‌బుక్ జారీ చేయాలని తహసీల్దార్‌కు ఆదేశించినట్లు వివరించారు. అనంతరం కురవి అప్పటి తహసీల్దార్ నాగేశ్వరరావు పేరుపై పాస్‌బుక్ జారీ చేసినట్లు తెలిపారు. ఈ ఉత్తర్వులపై మళ్లీ వరంగల్ కోర్టును ఆశ్రయించినప్పటికీ, జిల్లా పునర్విభజన అనంతరం మహబూబాబాద్ కోర్టుకు బదిలీ అయిన కేసులో కూడా అప్పీల్ రెండుసార్లు కొట్టివేయబడిందని పేర్కొన్నారు. అయితే భూమితో ఎటువంటి సంబంధం లేని కొందరు వ్యక్తులు డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి తెస్తూ, సోషల్ మీడియా, కొన్ని పత్రికల ద్వారా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో ఈ విషయంపై కురవి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సంబంధిత వ్యక్తులను పిలిపించి ఆధారాలు చూపించాలని పోలీసులు సూచించారని తెలిపారు. ఎలాంటి ఆధారాలు చూపలేకపోవడంతో భవిష్యత్తులో దుష్ప్రచారం చేయబోమని లిఖితపూర్వకంగా హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. తదుపరి కాలంలో ఎర్ర నాగేశ్వరరావు నుంచి సర్వే నంబర్ 161/ఎలోని 2 ఎకరాల భూమిని మాచర్ల ఉప్పలయ్య, సర్వే నంబర్ 283/బిలోని 1 ఎకరం 20 గుంటల భూమిని కానుగంటి సత్యనారాయణ కొనుగోలు చేసినట్లు తెలిపారు. వారు ప్రభుత్వ నిబంధనల మేరకు డీటీసీపీ లే అవుట్ అనుమతులు పొంది లేఅవుట్ అభివృద్ధి చేసి ప్లాట్లను విక్రయించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికీ కొందరు వ్యక్తులు సోషల్ మీడియా, పత్రికల ద్వారా అసత్య ప్రచారాలు చేస్తూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారని ఆరోపించిన బాధితులు, ప్రజలు అలాంటి ప్రచారాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ఎక్కడైనా, ఏ స్థాయిలోనైనా విచారణకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఇకపై తప్పుడు ఆరోపణలు, దుష్ప్రచారాలకు పాల్పడుతున్న వారిపై జిల్లా ఎస్పీకి, కురవి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు ఉప్పలయ్య, సత్యనారాయణ లు తెలిపారు.





## యాదయ్య గౌడ్ అంతిమ యాత్రలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి




**విశాలభారతి:** ఎల్.బి నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ తండ్రి యాదయ్య గౌడ్ గురువారం సాయంత్రం మృతి చెందిన నేపథ్యంలో, శుక్రవారం వారి భౌతిక కాయానికి రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నివాళులర్పించారు. వనస్థలిపురంలో జరిగిన యాదయ్య గౌడ్ అంతిమ యాత్రలో మంత్రి స్వయంగా పాల్గొని, దివంగత యాదయ్య గౌడ్ పట్ల తన గౌరవాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, రామ్మోహన్ గౌడ్ ను పరామర్శించి ఓదార్చారు. రామ్మోహన్ గౌడ్ కు ధైర్యం చెబుతూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. యాదయ్య గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. పార్టీ శ్రేణులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ అంతిమ యాత్రలో, మంత్రి వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## బాధితులను కుటుంబ సభ్యులుగా భావించి సేవలందించాలి

**పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి**

**విశాలభారతి, పెద్దపల్లి:**

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు,వార్షిక తనిఖీలలో భాగంగా పెద్దపల్లి జోన్ మహిళా పోలీస్ స్టేషన్‌ను పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మహిళా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న డీసీపీకి స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రమేష్ బాబు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.అనంతరం డీసీపీ పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించారు. ముఖ్యంగా రిసెప్షన్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో ఎలా వ్యవహరిస్తున్నారు, వారి సమస్యలను ఎలా స్వీకరిస్తున్నారు, ఫిర్యాదుల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారికి ఆత్మీయత కలిగేలా, కుటుంబ సభ్యులుగా భావించి మర్యాదపూర్వకంగా సేవలందించాలని సూచించారు.అనంతరం రిసెప్షన్ రికార్డులతో పాటు ఇతర స్టేషన్ రికార్డులను పరిశీలించి,వాటి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఫిర్యాదు నమోదు నుంచి చార్జ్‌షీట్ దాఖలు వరకు ప్రతి అంశాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. నిర్ణీత గడువులోగా దర్యాప్తు పూర్తి చేసి నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరచాలని తెలిపారు.పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మహిళలకు సంబంధించిన కేసుల వివరాలను తెలుసుకుని ,వాటి దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. మహిళా బాధితులకు న్యాయం జరిగేలా కేసుల విచారణను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారి సమస్యలను ఓపికగా విని,ఇరు కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి సమస్యకు పరిష్కారం చూపుతామని భరోసా కల్పించాలని అన్నారు.మహిళా పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదయ్యే కుటుంబ కలహాలకు సంబంధించిన కేసులు ,కౌన్సెలింగ్‌కు వచ్చే కేసులలో భార్యాభర్తల మధ్య విభేదాలు ఉన్నట్లయితే, విడిపోవడం వల్ల కలిగే అనర్థాలను వారికి వివరించాలని సూచించారు.సర్దుకుపోతేనే సంసారం సాఫీగా సాగుతుందని, చిన్న చిన్న సమస్యలకే తొందరపడి విడిపోవద్దని,కోర్టుల చుట్టూ తిరుగుతూ అన్ని విధాలా నష్టపోతున్న విషయాన్ని వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. భార్యాభర్తలిద్దరూ ఒకరినొకరు అర్థం చేసుకుంటే జీవితం సుఖమయంగా ఉంటుందని, కౌన్సెలింగ్ ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.ఈ తనిఖీలో పెద్దపల్లి ఏసీపీ జి.కృష్ణ, ఇన్‌స్పెక్టర్ రమేష్ బాబు,మహిళా ఎస్ఐ రాజమణి మరియు సిబ్బంది పాల్గొన్నారు.



## ఇంజనీరింగ్ కౌన్సిల్‌లో విద్యార్థుల వద్ద ఫీజులు వసూలు చేయరాదు

**మొదటిపేజీ తరువాయి**

గందరగోళంకు గురవుతున్నారు. అందుకే ముఖ్యమంత్రి చొరవ తీసుకొని గత 18 సంవత్సరాలుగా కొనసాగుతున్న విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఇటీవల ప్రభుత్వం తెచ్చినా జీవో నెంబర్ 89లతో స్పష్టత లేకపోవడం వలన తీవ్ర గందరగోళం ఏర్పడుతుంది. ఫీజులు విద్యార్థుల ఖాతాలోకి వేస్తామని పేర్కొనడంతో కాలేజీ యాజమాన్యాలు ఫీజులు కట్టమని ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంది. పైగా ప్రభుత్వం ఫీజులు కట్టకపోతే రెవెన్యూ రికవరీ యాక్ట్ క్రింద అరెస్టు చేస్తామని భయపెట్టడంతో విద్యార్థులలో భయందోళనలు చదువు పట్ల అనాసక్తి ఏర్పడుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 33 నెలలు గడుస్తుంది. ఆర్థిక పరిస్థితులు మెరుగుపడింది. ఇప్పటికే 4లక్షల కోట్లు అప్పు తెచ్చింది. 14 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు కోసం మరో 10 వేల కోట్లు అప్పు తెస్తే ఎవరికీ అభ్యంతరం లేదన్నారు. న్యాయమైన ఈ సమస్యపై ప్రభుత్వం తాత్సారం చేస్తే భవిష్యత్తులో జరిగే ఉద్యమాలకు భారీ మూల్యం చెల్లించవలసి వస్తుందని హెచ్చరించారు. జులై మొదటి వారంలో ఐదు లక్షల మంది విద్యార్థులతో హైదరాబాద్ నిర్బంధం చేస్తామని హెచ్చరించారు.

## ఫోటో స్టూడియోను ప్రారంభించిన సుందర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్



**దేవరుప్పుల విశాలభారతి:** మండలం,కడవెండి గ్రామానికి చెందిన ఫోటో&వీడియో గ్రాఫర్ గుమ్మడవెల్లి సోమేష్ నూతనంగా ఏర్పాటు చేసిన ఫోటో స్టూడియోను సుందర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్,బీఆర్ఎఫ్ మండల నాయకుడు,ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్త ఏల సుందర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏల సుందర్ మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని వ్యాపార రంగంలో ముందుకు రావాలని సూచించి స్టూడియో యజమాని గుమ్మడవెల్లి సోమేశ్ కు శుభాకాంక్షలు తెలియజేసి వ్యాపారం విజయవంతం కావాలని ఆకాంక్షించి ఫోటో స్టూడియోతో పాటు ఎలక్ట్రికల్, ప్లంబింగ్, ప్లాస్టిక్ ఐటమ్స్ కు సంబంధించిన వస్తువులను గ్రామస్తులకు అందుబాటులో ఉంచడం అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు తాటిపెల్లి మహేష్,గ్రామ ప్రజాప్రతినిధులు,బిఆర్ఎస్ నాయకులు సుడిగేల హనుమంత్,రత్నాకర్ రెడ్డి,యాకన్న,సుధాకర్, నర్సింహా,యువజన నాయకులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ బర్త్‌డే వేడుకల్లో యూత్ కాంగ్రెస్


**వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమాలు**




**దేవరుప్పుల విశాలభారతి :** ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని పాలకుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ శ్రేణులు హంగులు,ఆడంబరాలకు దూరంగా మానవత్వమే పరమార్థంగా దేవరుప్పుల మండలం,సీతారాంపురం గ్రామంలోని అనాథ వృద్ధాశ్రమంలో వృద్ధుల నడుమ ఈ వేడుకలను ఘనంగా జరిపారు. వృద్ధాశ్రమంలోని పెద్దలకు యూత్ కాంగ్రెస్ నాయకులు స్వయంగా పండ్లను, మిఠాయిలను పంపిణీ చేశారు.ఆశ్రమంలోని వృద్ధులతో కలిసి కేక్ కట్ చేసి రాహుల్ గాంధీ భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉండాలని వారి ఆశీస్సులు తీసుకున్నారు.దేశం కోసం,ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక నాయకుడు రాహుల్ గాంధీఅని,ఆయన పుట్టినరోజు నాడు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం మాకు గర్వకారణమని, రాహుల్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా యువత అంతా ప్రజాసేవలో ముందుండాలని ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.ఈ సేవా కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ రాజేష్ నాయక్, దేవరుప్పుల మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పులిగిల్ల వెంకన్న యాదవ్,నాయకులు యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

- పట్టుబడిన లారీని స్టేషన్‌కి తరలింపు
- 28 టన్నుల రేషన్ బియ్యం పట్టుబడినట్లు (ఎస్. హెచ్. ఓ ) మెడ ప్రసాద్ తెలిపారు




**బూర్గంపాడు, విశాలభారతి:** బూర్గంపాడు అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా బూర్గంపాడు పోలీసులకు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీ పట్టుబడింది. వివరాల్లోకి వెళితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జగ్గయ్యపేట నుండి చతిస్గడ్ రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్న 28 టన్నుల రేషన్ బియ్యం లారీని పట్టుకొని స్టేషన్ కు తరలించి ఈ అక్రమ రవాణాకు బాధ్యులైన ఏ 1) నవీన్ కుమార్ భాత్ర,తండ్రి నవ్రతాన్ మాల్ భాత్ర లారీ ఓనర్ ఓడి30ఈ 4221 తోపాటు ఏ 2) లారీ డ్రైవర్ బికాస్ ఆచార్య, తండ్రి బాబూలాల్ ఆచార్య మరియు బియ్యం వ్యాపారి శ్రీరంగం సత్యనారాయణ పై కేసు నమోదు చేసినట్లు (ఎస్. హెచ్. ఓ) మేడ ప్రసాద్ తెలిపారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన డిసిసి అధ్యక్షురాలు

**ధనవంతి లక్ష్మీనారాయణ దంపతులు**



**కొడకండ్ల విశాలభారతి:** మండలం కడగుట్ట తండా ఉపసర్పంచ్ వీర్యానాయక్ కుమారుని వివాహ వేడుకకు డిసిసి అధ్యక్షురాలు టిపిసి సభ్యులు ధన్వంతి లక్ష్మీనారాయణ దంపతులు హాజరయ్యారు. సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి వారి దాంపత్య జీవితం ఆనందమయం ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమము కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు గ్రామ పెద్దలు కార్యకర్తలు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# రోడ్డు కబ్జా... అధికారుల నిర్లక్ష్యం



రోడ్డుపైనే వ్యాపారం నిర్వహిస్తున్న కిరణా షాప్ యజమాని



కూడా చౌరస్తా రోడ్డు ఆక్రమించి వ్యాపారం చేస్తున్న వీధి వ్యాపారులు

**మదీనాగూడ నుంచి చందానగర్ వరకు ప్రజల అవస్థలు**

**సైబరాబాద్ - విశాల భారతి**

గంగారం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ నుంచి కాలనీ చౌరస్తా వరకు మాత్రమే కాదు, గంగారం హుడాకేప్ చౌరస్తా నుంచి మెయిన్ రోడ్డు వరకు, అలాగే చందానగర్ మున్సిపల్ ఆఫీస్ నుంచి మై హోం వరకు వెళ్లే మంజీరా పైప్ లైన్ రోడ్డు కూడా చిరు వ్యాపారుల ఆక్రమణకు గురైంది. ఈ రెండు కీలక మార్గాలపై విచ్చలవిడిగా పండ్లు, కూరగాయలు, ఇతర వస్తువులు అమ్ముతూ వ్యాపారులు రోడ్డును మొత్తం కబ్జా చేస్తున్నారు. దీంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు వేలాది మంది ప్రయాణించే ఈ రహదారులు ఇప్పుడు సంతలను తలపిస్తున్నాయి. రోడ్డు పక్కన పెట్టిన బండ్లు, క్రేట్లు, టెంట్ల కారణంగా రోడ్డు సగానికి సగం తగ్గిపోయింది. ఫలితంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. స్కూలు పిల్లలు ఆలస్యంగా చేరుతున్నారు, ఉద్యోగులు ఆఫీసులకు సమయానికి వెళ్లలేకపోతున్నారు. అత్యవసర సేవల కోసం వెళ్లే అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలు కూడా నిమిషాల తరబడి ట్రాఫిక్ లో చిక్కుకుపోతున్నాయి. ఫుట్ పాత్ లు పూర్తిగా ఆక్రమణకు గురికావడంతో మహిళలు, వృద్ధులు ప్రాణాలకు తెగించి రోడ్డుపైనే నడవాల్సి వస్తోంది. ఇప్పటికే పలు చిన్న చిన్న ప్రమాదాలు జరిగినా అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పలుమార్లు ట్రాఫిక్ పోలీసులకు, సీఎంసి అధికారులకు ఫిర్యాదులు చేసినా ఎటువంటి చర్యలు లేవని వారు మండిపడుతున్నారు. చిరు వ్యాపారులు బతకడం కోసం వ్యాపారం చేయడం తప్పు కాదని, కానీ రోడ్డును పూర్తిగా ఆక్రమించి ప్రజల ప్రయాణానికి అంతరాయం కలిగించడం సరికాదని స్థానికులు అంటున్నారు. వారికి ప్రత్యామ్నాయ స్థలం కేటాయించి రోడ్డును ఖాళీ చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. సైబరాబాద్ మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు ఉమ్మడిగా చర్యలు తీసుకుని గంగారం హుడాకేప్ నుంచి మెయిన్ రోడ్డు వరకు, చందానగర్ మున్సిపల్ ఆఫీస్ నుంచి మై హోం వరకు ఉన్న మంజీరా పైప్ లైన్ రోడ్డును ఆక్రమణల నుంచి విముక్తి చేయాలని వారు కోరుతున్నారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ రహిత ప్రయాణం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి కఠిన చర్యలు తీసుకుని స్థానికులకు ఉపశమనం కల్పించాలని వారు వేడుకుంటున్నారు.

## విద్య పేరుతో దోపిడీకి తెరలేపిన వీఆర్ జూనియర్ కళాశాల..? వెంటనే సీజ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ

- **అనుమతులు లేకుండా కళాశాల నిర్వహణ.. లక్షల ఫీజుల వసూళ్లు.. పుస్తకాలు కూడా కళాశాలలోనే కొనాలంటూ ఒత్తిడి**
- **యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్**



**అబ్దుల్లాపూర్మెట్, విశాల భారతి :** ప్రభుత్వ అనుమతులు లేకుండానే కళాశాలను నిర్వహిస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న వీఆర్ జూనియర్ కళాశాల యాజమాన్యంపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి, కళాశాలను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్ తీవ్రస్థాయిలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శివ కుమార్ మాట్లాడుతూ.. విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చి విద్యార్థులు, వారి తల్లిదండ్రులను దోచుకుంటున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ ఎలాంటి అనుమతులు లేకుండా కళాశాలను నిర్వహించడం చట్టాన్ని బహిరంగంగా ఉల్లంఘించడమేనని అన్నారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్న యాజమాన్యంపై సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. విద్యార్థులు పుస్తకాలు, స్టేషనరీని బయట కొనుగోలు చేయకుండా కళాశాలలోనే కొనాలని బలవంతం చేస్తున్నారని ఆరోపించారు. ఇది విద్యార్థులు, తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపే చర్య అని విమర్శించారు. లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ నాణ్యమైన విద్యను అందించకుండా విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.విద్యా వ్యవస్థను అపహాస్యం చేస్తున్న ఇలాంటి కళాశాలలపై ప్రభుత్వం వెంటనే ఉక్కుపాదం మోపాలని, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీఆర్ జూనియర్ కళాశాల సీజ్ అయ్యే వరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ అంశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించే ప్రజా దర్బార్‌లో లేవనెత్తి పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేస్తామని, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ఎలాంటి పోరాటానికైనా సిద్ధమని గుండె శివకుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వంశీ, నాయకులు నరేందర్, హరీష్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక శిక్షణ పూర్తి

- **హైదరాబాద్‌లో 24 మంది పోలీస్ కానిస్టేబుళ్లకు నైపుణ్యాభివృద్ధి**




**రాజేంద్రనగర్, విశాల భారతి :** ప్రమాదాల నివారణతో పాటు సమర్థవంతమైన ట్రాఫిక్ నిర్వహణ లక్ష్యంగా నిర్వహించిన ప్రత్యేక శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. తెలంగాణ పోలీస్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన సిటీ ఆర్మ్డ్ రిజర్వ్ (కార్ ) విభాగంలోని 24 మంది కానిస్టేబుళ్లకు 10 రోజులపాటు ఈ శిక్షణ అందించారు. జూన్ 8 నుండి జూన్ 19 వరకు జరిగిన ఈ శిక్షణలో రోడ్డు ప్రమాదాల సమయంలో తక్షణ స్పందన, బాధితులకు సహాయం, ట్రాఫిక్ నియంత్రణలో సమర్థత పెంపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రమాదాలపై నిరంతర పర్యవేక్షణ నిర్వహించడం, దర్యాప్తు అధికారులకు సహకరించడం కూడా ఈ కోర్సు ప్రధాన ఉద్దేశ్యంగా ఉంది. శిక్షణలో భాగంగా కేసు నమోదు నుంచి చార్జ్‌షీట్ దాఖలు వరకు అనుసరించాల్సిన విధానాలు, క్రైమ్ సీన్ మేనేజ్‌మెంట్, సాక్ష్యాధారాల సేకరణ, ఫోరెన్సిక్ పరీక్షల ప్రక్రియలపై సైద్ధాంతిక మరియు ప్రాయోగిక అవగాహన కల్పించారు. అదనంగా మోటార్ వాహనాల చట్టం, ట్రాఫిక్ నిబంధనలు, ట్రాఫిక్ నియంత్రణ పద్ధతులు, అత్యవసర స్పందన విధానాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డీఎస్పీ స్థాయి అధికారులు, న్యాయ నిపుణులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ఫోరెన్సిక్ మరియు వైద్య నిపుణులు శిక్షణ అందించారు. పర్సనాలిటీ డెవలప్‌మెంట్ అంశాలపై కూడా ప్రత్యేక తరగతులు నిర్వహించారు. శిక్షణ ప్రారంభోత్సవానికి అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ కవిత హాజరై ప్రాముఖ్యతను వివరించగా, ముగింపు కార్యక్రమానికి డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ శిక్షణ ద్వారా పొందిన నైపుణ్యాలు ప్రస్తుత ట్రాఫిక్ నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. ముగింపు సందర్భంగా శిక్షణలో పాల్గొన్న 24 మంది కానిస్టేబుళ్లకు ధృవపత్రాలు అందజేసి అభినందించారు.

## శంషాబాద్‌లో యువతి గల్లంతు... యువకుడిపై అనుమానం

**రాజేంద్రనగర్, విశాల భారతి :** శంషాబాద్ మండల పరిధిలోని రషీద్‌గూడ గ్రామంలో ఓ యువతి అనుమానాస్పదంగా గల్లంతైన ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అస్సాం రాష్ట్రానికి చెందిన దీపాలి బోరా (48), తన కుమార్తె గరీమా బోరా (22) మరియు తమ్ముడు పూర్ణోజిత్‌తో కలిసి గత 7 నెలలుగా రషీద్‌గూడలో అద్దె గదిలో నివసిస్తూ, సమీపంలోని ఎంఎటిసి కంపెనీలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం (జూన్ 18) ఉదయం 9 గంటల సమయంలో దీపాలి బోరా మరియు ఆమె తమ్ముడు పనికి వెళ్లగా, కడుపు నొప్పి కారణంగా గరీమా ఇంట్లోనే ఉండిపోయింది. మధ్యాహ్నం 1 గంట సమయంలో వారు ఇంటికి వచ్చి కలిసి భోజనం చేసి, తిరిగి పనికి వెళ్లేటప్పుడు గరీమాను ఇంట్లో ఉంచి తలుపు బయట నుంచి తాళం వేసి వెళ్లినట్లు తెలిపారు. అయితే సాయంత్రం 6 గంటలకు తిరిగి ఇంటికి రాగానే తలుపు తెరిచి ఉండటం గమనించారు. లోపలికి వెళ్లి చూడగా గరీమా కనిపించకపోవడంతో వెంటనే ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్‌గా వచ్చింది. గత వారం రోజులుగా గరీమా 'పొదుమ్' అనే యువకుడితో తరచూ ఫోన్‌లో మాట్లాడటం, మెసేజ్‌లు చేయడం జరుగుతుండటంతో అతనిపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ముందుగా కుమార్తెను మందలించినట్లు తల్లి తెలిపింది. గల్లంతైన గరీమా ఎత్తు సుమారు 5 అడుగులు, చామనచాయ రంగు, గ్రీన్ టాప్, బ్లాక్ లెగిన్ ధరించి ఉన్నట్లు సమాచారం. ఆమెకు హిందీ, అస్సామీ భాషలు వచ్చునని తెలిపారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో, బంధువుల వద్ద వెతికినా ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## "నేను సైతం" సీసీటీవీ కెమెరాల రీవెరిఫికేషన్‌పై సమీక్ష

**సైబరాబాద్ పరిధిలో లక్షా ముప్పై ఏడు వేల కెమెరాలు**






**సైబరాబాద్ విశాల భారతి :** "నేను సైతం" సీసీటీవీ కెమెరాల రీవెరిఫికేషన్ పనులపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం రమేష్ సమీక్ష నిర్వహించారు. సైబరాబాద్ సీపీ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి డీసీపీ స్పెషల్ బ్రాంచ్ సుధీంద్రతో కలిసి కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల ఎస్‌హెచ్‌ఓలు, ఎస్ఐలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీపీ మాట్లాడారు. కమిషనరేట్ వ్యాప్తంగా ఉన్న సీసీటీవీ కెమెరాల ప్రస్తుత స్థితి, పనితీరు, నిర్వహణ, జియో ట్యాగింగ్, రీవెరిఫికేషన్ ప్రక్రియను సమగ్రంగా పరిశీలించారు. కమిషనరేట్ పరిధిలో మొత్తం లక్షా ముప్పై ఏడు వేల నలభై రెండు "నేను సైతం" సీసీటీవీ కెమెరాలు జియో ట్యాగ్ చేయబడి ఉన్నాయి. వాటిలో శేరిలింగంపల్లి జోన్‌లో నలభై రెండు వేల నాలుగు వందల డెబ్బై ఐదు, కూకట్‌పల్లి జోన్‌లో యాభై మూడు వేల నాలుగు వందల ఇరవై నాలుగు, కుత్బుల్లాపూర్ జోన్‌లో నలభై ఒక్క వేల నూట నలభై మూడు కెమెరాలు ఉన్నాయి. నేరాల నివారణ, నేరస్థుల గుర్తింపు, దర్యాప్తు, ట్రాఫిక్ నిర్వహణ, ప్రజల భద్రతలో సీసీటీవీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని సీపీ అన్నారు. ప్రతి కెమెరా సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని "నేను సైతం" సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయో లేదో క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, రీవెరిఫికేషన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని కెమెరాలను జియో ట్యాగ్ చేసి, వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలన్నారు. పనిచేయని కెమెరాలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేయాలని, అవసరమైన ప్రాంతాల్లో కొత్త కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు, వ్యాపార సంస్థలు, అపార్ట్‌మెంట్ సంఘాలు, విద్యాసంస్థలు "నేను సైతం" కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. తమ ఇళ్లు, దుకాణాల వద్ద రోడ్డు వైపు కనిపించేలా ఒకటి లేదా రెండు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్‌హెచ్‌ఓలు, ఎస్ఐలు "నేను సైతం" సీసీటీవీ కెమెరాల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలని సీపీ ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీసీపీ స్పెషల్ బ్రాంచ్ సుధీంద్ర, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ నర్సింహులు, కమిషనరేట్ పరిధిలోని ఎస్‌హెచ్‌ఓలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## కందుకూరులో రూ.85 కోట్లతో రహదారి అభివృద్ధి పనులకు శ్రీకారం



**కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి శంకుస్థాపనలు – ప్రారంభోత్సవాలు**



**అబ్దుల్లాపూర్మెట్, విశాల భారతి :**

రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి వివిధ రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి, పూర్తయిన రహదారులను ప్రారంభించారు. ఈ సందర్భంగా లేమూరు గ్రామంలో రూ.38 కోట్ల అంచనా వ్యయంతో 14 కిలోమీటర్ల మేర నిర్మించనున్న నూతన డబుల్ లేన్ రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. లేమూరు నుంచి శ్రీశైలం జాతీయ రహదారి మీదుగా తిమ్మాపూర్ (వయా అగర్మియాగూడ) వరకు ఈ రహదారి నిర్మాణం చేపట్టనున్నారు. ఈ రహదారి పూర్తయితే స్థానిక ప్రజలకు మెరుగైన, వేగవంతమైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని నాయకులు తెలిపారు. అనంతరం బేగంపేట గ్రామంలో రూ.17 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న 6.2 కిలోమీటర్ల డబుల్ లేన్ రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. బేగంపేట - ఎలిమినేడు (వయా మాదాపూర్) మార్గాన్ని ఆధునికీకరించడం ద్వారా ప్రజలకు మరింత సౌకర్యవంతమైన రవాణా సదుపాయాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. తదుపరి తిమ్మాపూర్ గ్రామంలో రూ.30 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన 22 కిలోమీటర్ల ఆర్‌సీఐ గేట్ - మీర్‌ఖాన్‌పేట్ ప్రధాన రహదారిని ప్రారంభించారు. రావిర్యాల, కొంగరకలాన్, తిమ్మాపూర్, మాదాపూర్, గుమ్మడవల్లి, ఆకుల మైలారం గ్రామాల మీదుగా వెళ్లే ఈ విశాలమైన రహదారి వల్ల చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు సురక్షితమైన, వేగవంతమైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతోనే ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు వేగంగా అందించగలుగుతున్నామని, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహేందర్ రెడ్డి, కొండ విశ్వేశ్వర్ రెడ్డి, అందే శ్రీరాములు, కిచెన్ అన్నగారు లక్ష్మారెడ్డి, రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## పోడు రైతులకు అండగా ఉంటా..



- **అటవీశాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**
- **బోటిగూడెం,బందగిరినగర్ రైతుల సమస్యపై సానుకూల స్పందన...**
- **మళ్లీ సర్వే నిర్వహించాలని అధికారులకు ఆదేశం**

**పినపాక, విశాల భారతి :**

బోటిగూడెం, బందగిరినగర్ గ్రామాలకు చెందిన గిరిజన పోడు రైతుల సమస్యపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తక్షణమే స్పందించారు. అటవీ అధికారులు తమను వ్యవసాయం చేసుకోనివ్వకుండా అడ్డుకుంటున్నారని రైతులు ఇచ్చిన వినతిపత్రంపై ఆయన సానుకూలంగా స్పందించి, వారికి అండగా నిలుస్తానని భరోసా కల్పించారు. గత కొంతకాలంగా బోటిగూడెం, బందగిరినగర్ గ్రామాల్లోని సుమారు 45 గిరిజన కుటుంబాలు పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. అయితే, ఇటీవల అటవీశాఖ అధికారులు వారి వ్యవసాయ పనులను అడ్డుకోవడంతో స్థానిక గిరిజన రైతులు ఆందోళనకు గురయ్యారు. తమ జీవనాధారమైన భూములను కాపాడాలని కోరుతూ వారంతా కలిసి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు.

**అధికారులకు స్పష్టమైన ఆదేశాలు..**

గిరిజన రైతుల ఆవేదనను విన్న ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అటవీశాఖ అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. అటవీ అధికారులు రైతులను ఇబ్బంది పెట్టొద్దని సూచించారు. ఒకటి రెండు రోజుల్లోనే ఆయా భూముల్లో మళ్లీ సర్వే నిర్వహించాలని, అర్హులైన రైతుల భూములను వారికే అప్పగించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**మంత్రులతో మాట్లాడి శాశ్వత పరిష్కారం..**

అనంతరం రైతులను ఆప్యాయంగా పలకరించి వారిలో మనోధైర్యాన్ని నింపారు. రాష్ట్ర మంత్రుల దృష్టికి పోడు భూముల సమస్యను తీసుకెళ్లి, త్వరలోనే దీనికి ఒక శాశ్వత పరిష్కారం చూపే దిశగా తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గిరిజన రైతులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే తక్షణ స్పందనతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

## గౌరెల్లి గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రం.. వాటర్‌మెన్‌ను మార్చాలని గ్రామస్తుల విజ్ఞప్తి

**నాలుగు రోజులుగా మంచినీటి సరఫరా నిలిచిపోయిందని ఆరోపణ – అధికారులకు వినతిపత్రం అందజేసిన గ్రామ ప్రజలు**



**అబ్దుల్లాపూర్మెట్, విశాల భారతి :** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం గౌరెల్లి గ్రామంలో గత నాలుగు రోజులుగా తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ అధికారులు, వాటర్ వర్క్స్ అధికారులకు గ్రామస్థులు వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో విధులు నిర్వహిస్తున్న వాటర్‌మెన్ ఇటికాల జంగయ్య సమయానికి నీటిని విడుదల చేయడం లేదని, పలుమార్లు చెప్పినా తన విధానాన్ని మార్చుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపించారు. ఆయన నిర్లక్ష్య వైఖరి కారణంగా గ్రామ ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు సకాలంలో మంచినీరు అందకపోవడంతో ప్రభుత్వ అధికారులపై కూడా ప్రజల్లో అపోహలు ఏర్పడుతున్నాయని గ్రామస్థులు తెలిపారు. అందువల్ల ఇటికాల జంగయ్యను గౌరెల్లి గ్రామం నుంచి బదిలీ చేసి, ఆయన స్థానంలో కొత్త వాటర్‌మెన్‌ను నియమించాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు. తమ విజ్ఞప్తిని అధికారులు వెంటనే పరిగణనలోకి తీసుకుని తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని గ్రామస్థులు కోరారు. ఒకవేళ ఈ సమస్యపై తక్షణ చర్యలు తీసుకోకపోతే ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి పరిస్థితిని వివరించి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. గ్రామ ప్రజల తరఫున గ్యార నరసింహ ఈ విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

## ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన ఈఎస్ఐ ఆసుపత్రిలో అవగాహన సదస్సు




**కూకట్ పల్లి విశాల భారతి:** భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన పథకంపై శుక్రవారం నాడు ఎర్రగడ్డలోని ఈఎస్ఐ ఆసుపత్రి ఆడిటోరియంలోన అవగాహన సదస్సు కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఈటల రాజేందర్, వడ్డేపల్లి రాజేశ్వరరావు లు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు, ఉద్యోగాల సృష్టిని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన ద్వారా యువతకు, ఉద్యోగార్థులకు సంస్థలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. దేశ అభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమని, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు ద్వారా వికసిత్ భారత్ లక్ష్య సాధనకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వడ్డేపల్లి రాజేశ్వరరావు గారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కూకట్పల్లికి చెందిన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ 57వ జన్మదిన వేడుకలు

**రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కేక్ కట్ చేసిన జిల్లా అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి**



**అబ్దుల్లాపూర్మెట్, విశాల భారతి :** భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ 57వ జన్మదిన వేడుకలను శుక్రవారం రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మంద మల్లమ్మ రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి, కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ విలువల పరిరక్షణ, సామాన్య ప్రజల సంక్షేమం కోసం రాహుల్ గాంధీ నిరంతరం కృషి చేస్తున్నారని చల్లా నరసింహారెడ్డి కొనియాడారు. యువతకు స్ఫూర్తిదాయక నాయకుడిగా ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు రాహుల్ గాంధీ దీర్ఘాయుష్షుతో మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మండల నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## విద్యుత్ సరఫరాలో అంతరాయం

**హైదర్‌నగర్ పరిధిలో ఆదివారం నిర్వహణ పనుల కారణంగా కోత**

**హైదర్‌నగర్ విశాల భారతి:** నిర్వహణ పనుల కారణంగా శనివారం హైదర్‌నగర్ సెక్షన్ పరిధిలో రెండు ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. 11 కెవి నందమూరి నగర్ ఫీడర్‌కు శనివారం ఉదయం పది గంటల నుంచి పన్నెండు గంటల ముప్పై నిమిషాల వరకు విద్యుత్ సరఫరా ఉండదు. ఈ ఫీడర్ 33/11 కెవి హెచ్‌ఎమ్‌టి హిల్స్ సబ్ స్టేషన్ నుంచి వెళ్తుంది. దీంతో నందమూరి నగర్, బృందావన్ కాలనీ, గౌతమి నగర్ ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది. 11 కెవి హైదర్‌నగర్ ఫీడర్‌కు శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల ముప్పై నిమిషాల వరకు విద్యుత్ నిలిపివేత ఉంటుంది.

# ఇంకెన్నాళ్లు అద్దె భవనంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం





- దశాబ్దంనరకాలంగా సేవలకు నోసుకోని రిసోర్స్ భవనం
- అద్దెలకు లక్షలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం
- ప్రజాధనం వృధా చేస్తున్నారని ఆగ్రహం

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, విశాల భారతి :**

మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి బూర్గంపాడు ప్రాజెక్టు పరిధిలోని అశ్వాపురం మండలంలో 2011లో రూ.10 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టిన ఐసిడిఎస్ రిసోర్స్ భవనం లక్ష్య సాధనను చేరుకోకుండా నిరుపయోగంగానే ఉంటుంది. లక్షలాది రూపాయల ప్రజాధనంతో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు సేవలందించాలన్న లక్ష్యంతో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేపట్టిన భవనాన్ని వినియోగించుకోవడంలో ఆ శాఖ అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారనే ఆరోపణలవస్తున్నాయి. ఓ పక్కన ప్రాజెక్టు నిర్వహణ కోసం కార్యాలయం అవసరం ఉంది. అవసరాలకనుగుణంగా ఈ భవన నిర్మాణం రూపుదిద్దుకున్నప్పటికీ ఆనాటి నుండి నేటి వరకు ఆ శాఖ జిల్లా ఉన్నతాధికారులు, ఐసిడిఎస్ బూర్గంపాడు ప్రాజెక్టు అధికారుల తీవ్ర నిర్లక్ష్యానికి భవనం వాడుకలోకి రాకపోగా వేలాది రూపాయలను వెచ్చించి మరో కిరాయి భవనంలో కార్యకలాపాలు నిర్వహించడం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**సర్కారు భవనం ఉంచుకొని కిరాయి భవనంలో ప్రాజెక్టు కార్యాలయం ఏంటి ?**

ఐసిడిఎస్ ప్రాజెక్టుకు అశ్వాపురంలో 2011 ఏడాదిలో ప్రభుత్వం అంగు ఆర్భాటాలతో నిర్మాణం చేపట్టిన భవనం ఉంచుకొని అటు బుర్గంపాడు, ఇటు అశ్వాపురంలో కాకుండా ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని ఎంపీ బంజర లో ఓ అద్దె భవనంలో గత కొన్ని దశాబ్దాలుగా నిర్వహణ కార్యక్రమాలు చేపట్టడం వెనక అధికారుల ఆంతర్యం ఏమిటని ప్రజలు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు పరిధిలో అశ్వాపురం, బూర్గంపాడు మండలాలు ఉండగా ఈ రెండు మండలాలలో ఏదో ఒక చోట ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం పెట్టాల్సి ఉన్నప్పటికీ ఆ శాఖ అధికారులు వారికి అనుకూలమైన ప్రాంతంగా బంజరను ఎంచుకొని కార్యాలయం నడుపుతున్నారని పలువురు అంటున్నారు. సొంత భవనం ఉంచుకొని కూడా అద్దె భవనంలో ప్రాజెక్టు నిర్వహణ చేపడుతూ ప్రజాధనాన్ని పెద్ద ఎత్తున దుర్వినియోగం చేస్తున్నారని, ఈ రెండు మండలలా ప్రజలు అంటున్నారు. మండల కేంద్రాలలో కార్యాలయాలు ఉంటే అధికారుల పనితీరును ఇతర శాఖల అధికారులు గమనిస్తారన్న ఉద్దేశంతోనే ఈ శాఖ అధికారులు అటు ఇటు కాకుండా మధ్యలో కార్యాలయం నుంచి అంగన్వాడీల కార్యకలాపాలను నిర్వహిస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెలివెత్తుతున్నాయి. ఓ పక్కన ప్రభుత్వం కిరాయి భవనాలలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని నిబంధనలను పెట్టినప్పటికీ బూర్గంపాడు ఐసిడిఎస్ అధికారులు అశ్వాపురంలో ఐసిడిఎస్ రిసోర్స భవనం ఉన్న సంగతిని కూడా మరిచిపోయి ఇంకా మొరంపల్లి బంజర లోనే ప్రాజెక్టు కార్యాలయాన్ని నడపడం పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఐసిడిఎస్ అధికారులు వ్యవహరిస్తున్న నిర్లక్ష్యం పట్ల సంబంధిత శాఖ జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అశ్వాపురం మండల కేంద్రంలో ఖాళీగా ఉన్న రిసోర్స్ భవనంలో ప్రాజెక్టు కార్యాలయాన్ని నిర్వహించేలా చర్యలు చేపట్టాలని పాలువురు కోరుతున్నారు.

## మహిళలకు బ్యూటీ పార్లర్, టైలరింగ్ ఉచిత శిక్షణ తరగతులు

**భారతీయ స్టేట్ బ్యాంక్ సంచాలకులు యండీ. అలీఖాన్**



**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని చిలుకూరు భారతీయ స్టేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో మహిళలకు బ్యూటీ పార్లర్, టైలరింగ్ ఉచిత స్వయం ఉపాధి శిక్షణ తరగతులు ప్రారంభించనున్నామని, ఆ సంస్థ సంచాలకులు యండీ.అలీఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత హాస్టల్ వసంతి కల్పించబడుతుందన్నారు. ఈనెల 22వ తేదీ నుంచి బ్యూటీ పార్లర్ ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమై 35 రోజులపాటు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మహిళల టైలరింగ్ ఉచిత శిక్షణ తరగతులు జూలై 1వ తేదీ నుంచి ప్రారంభమై 31 రోజులపాటు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు చిలుకూరు ఎస్బీఐ సంస్థ కార్యాలయంలో కానీ, 7981951167, 9550606019 నంబర్ లో గానీ సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. అభ్యర్థుల కనీస అర్హత 10వ తరగతి ఉత్తీర్ణలై ఉండాలని, వయోపరిమితి 18 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాలు లోపు ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థులు రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలకు చెందిన వారై ఉండాలని, ఎస్ఎస్ఎస్సీ మెమో, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, 4 పాస్ ఫోటోలు, బ్యాంకు పాసు పుస్తకం, కుల ధృవీకరణ జిరాక్స్ పత్రాలను సమర్పించాలన్నారు. స్వయం ఉపాధి రంగాల్లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని ఆ సంస్థ సంచాలకులు యండీ.అలీఖాన్ తెలిపారు.

## ఘనంగా శ్రీ పార్వతీ సమేత సోమేశ్వర స్వామి వారి 16వ వార్షిక బ్రహ్మోత్సవాలు

**బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంతారెడ్డి**



**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో గల శ్రీ పార్వతీ సమేత సోమేశ్వర స్వామి వారి 16వ వార్షిక బ్రహ్మోత్సవాలు, శివపార్వతుల కళ్యాణ మహోత్సవం శుక్రవారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ శివపార్వతుల కళ్యాణం వైభవంగా జరగగా, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంతరెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ దేవాలయాలను సందర్శించడం ద్వారా మానసిక ప్రశాంతత, మనశాంతిని పొందవచ్చని అన్నారు. ఆధ్యాత్మికత మనిషిలో సానుకూల ఆలోచనలను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు కంజర్ల ప్రకాష్, మాజీ సర్పంచ్ ముదిగొండ శ్రీహరి యాదవ్, మోర నరసింహారెడ్డి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ ముదిగొండ జంగం యాదవ్ ఆధ్వర్యంలో ఆలయాన్ని మామిడాకుల తోరణాలు, రంగురంగుల పూలతో అందంగా అలంకరించారు. విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేసి, దర్శన ఏర్పాట్లు కల్పించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కుమ్మరి శివరాజ్, గ్రామ పెద్దలు, భక్తులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యాక్సిడెంట్‌లో గాయపడిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు చందా నాగేశ్వరరావును పరామర్శించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**విశాల భారతి తాటిగూడెం గ్రామం, కరకగూడెం మండలం**



**జిల్లా భద్రాద్రి కొత్తగూడెం:** పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తాటిగూడెం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చందా నాగేశ్వరరావును ఆయన నివాసంలో పరామర్శించారు. నెల రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన చందా నాగేశ్వరరావు ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అడిగి తెలుసుకుని, ప్రస్తుతం ఆయన కోలుకుంటుండడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తల సంక్షేమం పట్ల తాను ఎల్లప్పుడూ శ్రద్ధ చూపుతానని తెలిపారు. త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని తిరిగి ప్రజా సేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే, అవసరమైన సహాయ సహకారాలు అందుబాటులో ఉంటాయని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కరకగూడెం మండల కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి ఎర్ర సురేష్, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగబండి వెంకటేశ్వర్లు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు చౌలం కేశవరావు, మాజీ సర్పంచ్ తోలెం నాగేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే కరకగూడెం సర్పంచ్ పోలేబోయిన సుజాత, రేగళ్ల సర్పంచ్ బాడిశ పార్వతి, పద్మాపురం సర్పంచ్ తోలెం రమేష్, చొప్పాల సర్పంచ్ తోలెం సావిత్రి, గొల్లగూడెం సర్పంచ్ ఏళ్లబోయిన ముత్తమ్మ, కొత్తగూడెం సర్పంచ్ ఎర్రం పొట్టయ్య, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు, అభిమానులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## మియాపూర్ ఫ్లైఓవర్ పనులను సమీక్షించిన గాంధీ

**సైబరాబాద్ - విశాల భారతి**



మియాపూర్ చౌరస్తా నుంచి ఆల్విన్ కాలనీ వరకు 530 కోట్ల రూపాయలతో చేపట్టిన 6 లేన్ల ఫ్లైఓవర్ నిర్మాణ పనులను పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ శుక్రవారం పరిశీలించారు. 1790 మీటర్ల పొడవు, 24 మీటర్ల వెడల్పుతో నిర్మించనున్న ఈ ఫ్లైఓవర్‌తో పాటు హఫీజ్‌పేట్ నుంచి మియాపూర్ వరకు 3 లేన్ల అండర్‌పాస్, బాచుపల్లి నుంచి ఆల్విన్ వరకు మరో 3 లేన్ల అండర్‌పాస్ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కమిషనర్ సృజన, జోనల్ కమిషనర్లు నారాయణ్ అమిత్ మాలెంపాటి, మయాంక్ సింగ్, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, ముఖ్య నగర ప్రణాళికాధికారి వెంకన్న, కమిషనరేట్, హైటెక్ సిటీ ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ ప్రాజెక్టుల ఇంజనీరింగ్ అధికారులు వెంట ఉన్నారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. మియాపూర్ ఫ్లైఓవర్ నిర్మాణాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారని తెలిపారు. ఈ ఫ్లైఓవర్‌తో మియాపూర్, చందానగర్, హఫీజ్‌పేట్, బాచుపల్లి మార్గాల్లో ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని, వాహనదారులకు ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు.పనుల పురోగతి, భూసేకరణ వివరాలపై అధికారులను అడిగి తెలుసుకున్న గాంధీ... పెండింగ్‌లో ఉన్న పనులు వేగంగా పూర్తి చేయాలని, శాఖల మధ్య సమన్వయం మెరుగుపరచాలని సూచించారు. నిర్ణీత గడువులోగా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.ట్రాఫిక్ రహిత సమాజం లక్ష్యంగా హైటెక్ సిటీ ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ ప్రాజెక్టు ద్వారా శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిద్దుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రణాళికాధికారి తులసి రామ్, సహాయ కమిషనర్ సురేందర్, హైటెక్ సిటీ ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ ప్రాజెక్టుల కార్యనిర్వాహక ఇంజనీర్ గోపాల్, డిప్యూటీ ఇంజనీర్ వరుణ్, సహాయ ఇంజనీర్ శ్రీనాథ్, కమిషనరేట్ డిప్యూటీ ఇంజనీర్ శ్రీదేవి, పారిశుధ్య డిప్యూటీ ఇంజనీర్ వశిధర్, సహాయ ఇంజనీర్ నిఖిల్ పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు అధికారుల హెచ్చరికలు



- కల్వర్టులు, వాగుల వద్ద నిర్లక్ష్యం ప్రాణహానికి దారి
- వరద ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచనలు

**చేవెళ్ల, విశాల భారతి :**

శుక్రవారం: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేవెళ్ల ఏసీపీ కిషన్ సూచించారు. ఆయన పర్యవేక్షణలో మున్సిపల్ కమిషనర్ యాదగిరి, చేవెళ్ల సొసైటీ చైర్మన్ దేవర వెంకటరెడ్డి, సర్కిల్ ఇన్స్పెక్టర్ భూపాల్ శ్రీధర్, 8వ వార్డు కౌన్సిలర్ దేవల్ గారి గోపాల్ రెడ్డి తదితరులు శుక్రవారం కల్వర్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ చెరువులు, వాగులు, కాలువలు, కల్వర్టులు మరియు బ్రిడ్జిల వద్ద వర్షాకాలంలో నీటి ప్రవాహం అధికంగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రాణ మరియు ఆస్తి నష్టాలు సంభవించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజలు వరద నీరు ప్రవహిస్తున్న వాగులు, కాలువలు, కల్వర్టులు, బ్రిడ్జిలను దాటేందుకు ప్రయత్నించవద్దని సూచించారు. నీటి లోతు, వేగం తెలియకుండా వాహనాలతో గానీ, నడిచి గానీ వెళ్లకూడదని పేర్కొన్నారు. చిన్నపిల్లలను వరద ప్రాంతాలకు వెళ్లకుండా తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. భారీ వర్షాల సమయంలో అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లకూడదని, విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన తీగలు మరియు నీటిలో మునిగిన పరికరాల దగ్గరకు వెళ్లకుండా జాగ్రత్త పడాలని తెలిపారు. పశువులను కూడా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ప్రజలందరూ స్థానిక అధికారులు, గ్రామ పంచాయతీ, పోలీస్ శాఖ మరియు విపత్తు నిర్వహణ శాఖ జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించాలని, ఏదైనా ప్రమాదకర పరిస్థితి గమనించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్తయ్య, మాజీ ఉపసర్పంచులు టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, బి. విజయ్ కుమార్, మాజీ డైరెక్టర్ యాదయ్య, నాయకులు ఎర్ర గోపాల్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

### గచ్చిబౌలి, తారానగర్ పరిధిలో ఆదివారం సరఫరా బంద్

**సైబరాబాద్ విశాల భారతి:** వివిధ నిర్వహణ పనుల కారణంగా గచ్చిబౌలి, తారానగర్ సెక్షన్ల పరిధిలో ఆదివారం,విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది.

**గచ్చిబౌలి సెక్షన్‌లో ఆదివారం కోత**

ఫీడర్ మరమ్మతు పనుల కారణంగా ఆదివారం గచ్చిబౌలి సెక్షన్ పరిధిలో ఆరు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. 11 కెవి చర్చి ఐటి ఫీడర్, 11 కెవి టింబర్ లేక్ ఫీడర్లకు ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు. నానక్రామ్‌గూడ, అల్యాకాయ హోమ్స్, సుమధుర అపార్టుమెంటు, రైదుర్గం కిమ్స్ ఆసుపత్రి వెనుక ప్రాంతం, టింబర్ లేక్ కాలనీ, ప్రశాంతి హిల్స్ కాలనీ, రైదుర్గం ప్రధాన రహదారి తదితర ప్రాంతాలు ప్రభావితమవుతాయి.

**తారానగర్ సెక్షన్‌లో ఆదివారం బంద్**

పౌరుల రక్షణ, ప్రమాదాల నివారణకు ట్రీ ప్రూనింగ్ లైన్ క్లియరెన్స్ పనుల కారణంగా ఆదివారం తారానగర్ సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. 11 కెవి రామాలయం ఫీడర్‌కు ఆదివారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒక గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదు. గాంధీ ఎస్టేట్, హుడా ట్రేడ్ సెంటర్, లింగంపల్లి గ్రామం ప్రాంతాలకు అంతరాయం ఏర్పడుతుంది.11 కెవి తారానగర్ ఫీడర్‌కు ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ నిలిపివేత ఉంటుంది.శివాజీ నగర్, లింగంపల్లి,తారానగర్, వెంకటాద్రి నగర్ ప్రాంతాలు ప్రభావితమవుతాయి. పనులు ముందుగా పూర్తయితే నిర్ణీత సమయం కంటే ముందే విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని అధికారులు స్పష్టం చేశారు.

## హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా శంకరయ్య బాధ్యతల స్వీకరణ

- మాజీ ఇన్‌స్పెక్టర్ నాగరాజ్ గౌడ్‌కు సీపీ కార్యాలయానికి బదిలీ
- శాంతిభద్రతలకు ప్రాధాన్యతనిస్తామని శంకరయ్య వెల్లడి



**అబ్దుల్లాపూర్మెట్, విశాల భారతి :** హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా శంకరయ్య నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన అధికారుల బదిలీల్లో భాగంగా ఇప్పటివరకు హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన నాగరాజ్ గౌడ్‌ను సీపీ కార్యాలయానికి బదిలీ చేశారు. దీంతో ఆయన స్థానంలో శంకరయ్య హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీసు అధికారులు, సిబ్బంది నూతన ఇన్‌స్పెక్టర్ శంకరయ్యకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శంకరయ్య మాట్లాడుతూ.. ప్రజలకు సత్వర, పారదర్శక పోలీసు సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు. మహిళల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ నేరాల నివారణ, ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఆయన తెలిపారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఎదురైనా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని, పోలీసు-ప్రజల సమన్వయంతో హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని నూతన ఇన్‌స్పెక్టర్ శంకరయ్య తెలిపారు.

## బూత్ లెవల్‌పై ఫోకస్ పెంచిన కాంగ్రెస్.. చేవెళ్లలో భారీ సమావేశం

**చేవెళ్ల, విశాల భారతి:** చేవెళ్ల నియోజకవర్గంలోని ఎస్ఎల్వి కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం "సార్ అవగాహన సదస్సు మరియు చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గం బూత్ లెవెల్ బిఎల్ఏ శిక్షణ సమావేశం" కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి భువనగిరి పార్లమెంట్ సభ్యులు మరియు రంగారెడ్డి జిల్లా పార్లమెంట్ ఎస్ఎస్ఏ కోఆర్డినేటర్ చామల కిరణ్ కుమార్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్ల నరసింహా రెడ్డి, చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ భీమ్ భరత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి పాల్గొని సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా సార్ పై అవగాహన పెంపొందించడం, బూత్ స్థాయి నాయకులకు అవసరమైన శిక్షణ అందించడం లక్ష్యంగా పలు సూచనలు చేశారు. పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి కార్యకర్తల పాత్ర కీలకమని నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ బోర్డ్ సభ్యులు సత్యనారాయణ రెడ్డి, ముదిరాజ్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, టి.పి.సి.సి అధికార ప్రతినిధి గౌరీ సతీష్, చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ సమత వెంకట్ రెడ్డి, సర్దార్ నగర్ మార్కెట్ చైర్మన్ సురేందర్ రెడ్డి, మండల అధ్యక్షులు, నియోజకవర్గ నాయకులు మరియు బిఎల్ఏ లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడిగా బేగరి రాజు



**మొయినాబాద్, విశాలభారతి:** రంగారెడ్డి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా మొయినాబాద్ మండలం సురంగల్ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త బేగరి రాజును జిల్లా కలెక్టర్ నియమించారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ సూపరింటెండెంట్ ఎన్. చంద్రశేఖర్ నియామక పత్రాన్ని బేగరి రాజుకు అందజేశారు.ఈ సందర్భంగా బేగరి రాజు మాట్లాడుతూ, గత 15 సంవత్సరాలుగా ఎస్సీ, ఎస్టీ వర్గాల విద్య, వైద్యం, ఉపాధి మరియు సంక్షేమ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు రాజ్యాంగబద్ధ హక్కులు అందేలా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాల సాధన కోసం పోరాటం చేస్తున్నానన్నారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేస్తూ అనేక ప్రజా సమస్యలను పరిష్కరించిన తన సేవలను గుర్తించి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా అవకాశం కల్పించిన జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు మరియు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అసైన్డ్ భూముల సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శ్రీనివాస్ పాల్గొన్నారు. సురంగల్ గ్రామానికి చెందిన వ్యక్తి జిల్లా స్థాయి కమిటీలో చోటు దక్కించుకోవడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించిన బాకారం జాగీర్ సర్పంచ్ వెంకటేష్ గౌడ్



**మొయినాబాద్, విశాలభారతి:** పిల్లల విద్యాభ్యాసానికి అక్షరాభ్యాసం తొలి మెట్టు అని బాకారం జాగీర్ గ్రామ సర్పంచ్ ఎల్గని వెంకటేష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మొయినాబాద్ మండలంలోని బాకారం జాగీర్ గ్రామ అంగన్వాడి కేంద్రం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ వెంకటేష్ గౌడ్ సరస్వతి దేవి పూజ అనంతరం చిన్నారులతో ఓం అక్షరాన్ని దిద్దించి విద్యాభ్యాసాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సరస్వతి దేవి, వినాయకుడి అనుగ్రహంతో పిల్లలు విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. చిన్నారుల్లో జ్ఞానం, తెలివితేటలు, జ్ఞాపకశక్తి పెంపొందేలా అంగన్వాడి టీచర్లు, పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.సాధారణంగా రెండు నుంచి ఐదు సంవత్సరాల వయస్సు గల పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించడం ఆనవాయితీ అని తెలిపారు. పిల్లలకు తల్లే తొలి గురువు అని పేర్కొంటూ, వారి మానసిక వికాసం, విద్యా అభివృద్ధికి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొంతం నాగేశ్వర్ రెడ్డి, రాధిక రాఘవరెడ్డి, ఉమారాణి భిక్షపతి గౌడ్, బందీ అనిల్ కుమార్, రాయనోళ్ల ఉపేందర్ యాదవ్, కొండకల్ల రవి, మడి దినేశ్ రెడ్డి, కొండకల్ల శ్రీకాంత్, కొండకల్ల మహేందర్, హైస్కూల్ హెడ్‌మాస్టర్ భాస్కర్ రెడ్డి, ఎంపీపీఎస్ హెచ్‌ఎం రాధిక, అంగన్వాడి టీచర్లు వనజ, నిర్మల, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## సబితా ఇంద్రారెడ్డికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి బహిరంగ లేఖ.. రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం

**ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాలు తెలుసుకోవాలని సూచన.. సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన లేఖ**



**అబ్దుల్లాపూర్మెట్, విశాల భారతి :** రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేస్తున్న విమర్శలకు ప్రతిస్పందనగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి రాసిన బహిరంగ లేఖ ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని "వదినమ్మ"గా సంబోధిస్తూ ఎమ్మెల్యే రాసిన ఈ లేఖ సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతోంది. లేఖలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందడం లేదని సబితా ఇంద్రారెడ్డి తరచూ వ్యాఖ్యానిస్తున్నారని పేర్కొన్నారు. అయితే అలాంటి వ్యాఖ్యలు చేసే ముందు క్షేత్రస్థాయిలో స్వయంగా పర్యటించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న "ఇందిరమ్మ చీర", మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్న "మహాలక్ష్మి పథకం", రేషన్ దుకాణాల ద్వారా అందిస్తున్న సన్నబియ్యం, మహిళా సంఘాలకు వడ్డీ లేని రూ.10 లక్షల రుణాలు, "కళ్యాణలక్ష్మి" ఆర్థిక సహాయం, "ఇందిరమ్మ ఇళ్లు", "గృహజ్యోతి" కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ వంటి పథకాల ప్రయోజనాలను స్వయంగా పరిశీలించాలని లేఖలో కోరారు. పథకాలపై ఏవైనా సందేహాలు ఉంటే అర్హులైన లబ్ధిదారులను కలిసి వివరాలు తెలుసుకోవాలని, అప్పుడు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై పూర్తి అవగాహన వస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు మేలు చేసే అంశాలపై సబితా ఇంద్రారెడ్డి నుంచి సూచనలు వచ్చినా వాటిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు లేఖలో తెలిపారు.

# జాతీయ స్థాయి కార్యశాలను నిర్వహించిన సీబీఐటీ

**విశాలభారతి:**

చైతన్య భారతీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ , హైదరాబాద్‌లోని అకాడెమిక్ అండ్ ఎగ్జామినేషన్ సెల్ ఆధ్వర్యంలో "పరీక్షలు మరియు మూల్యాంకన వ్యవస్థల్లో నాణ్యత, సమగ్రత మరియు అత్యుత్తమత అనే అంశంపై జూన్ 19, 2026న సంస్థ అసెంబ్లీ హాల్‌లో ఒకరోజు జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో దేశంలోని వివిధ విద్యాసంస్థల నుంచి విద్యావేత్తలు, పరీక్షల నిర్వాహకులు, విధాన నిర్ణేతలు, పరిశ్రమ నిపుణులు పాల్గొని పరీక్షా సంస్కరణలు, డిజిటల్ మూల్యాంకనం, నాణ్యత హామీ వంటి అంశాలపై సమగ్ర చర్చలు జరిపారు. సభకు అధ్యక్షత వహించిన సీబీఐటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.వి. నరసింహులు సంస్థ గత 47 సంవత్సరాల ప్రస్థానాన్ని వివరించారు. విద్యా ప్రమాణాలు, పరిశోధన, ఆవిష్కరణలు, పరిశ్రమలతో భాగస్వామ్యం, నాణ్యమైన విద్య అందించడంలో సీబీఐటీ సాధించిన విజయాలను ప్రస్తావించారు. పరీక్షలు మరియు మూల్యాంకన వ్యవస్థల్లో పారదర్శకత, సమగ్రత, నాణ్యతను కాపాడటం ద్వారా విద్యా ప్రమాణాలు మరియు సంస్థ ప్రతిష్ట మరింత బలోపేతం అవుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి కేంద్రిత, సాంకేతిక ఆధారిత, పారదర్శక పరీక్షా విధానాలు విద్యా సమగ్రతను పెంపొందించడంతో పాటు విద్యా ఫలితాలను మెరుగుపరుస్తాయని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్ గౌరవ అతిథిగా పాల్గొని, ఉన్నత విద్యలో మారుతున్న అవసరాలకు అనుగుణంగా వినూత్న మూల్యాంకన విధానాలను అవలంబించడం అవసరమని వివరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కె. శశికాంత్ "ప్రస్తుత పరీక్షా సంస్కరణలు - భవిష్యత్ దిశలు" అనే అంశంపై ప్రసంగించి, డిజిటల్ పరివర్తన, ఆధునిక మూల్యాంకన విధానాలు, విధానపరమైన మార్పుల గురించి విశ్లేషించారు. డాక్టర్ దేవేష్ నిగమ్ "భారతదేశంలోని ఉన్నత విద్యాసంస్థల్లో పరీక్షా సంస్కరణలలో కొత్త దృక్పథం" అనే అంశంపై కీలక ప్రసంగం చేసి, ఫలితాధారిత మూల్యాంకనం, అకాడెమిక్ పారదర్శకత, మూల్యాంకన ప్రక్రియల్లో సాంకేతికత సమన్వయంపై వివరించారు. మధ్యాహ్ననంతర సాంకేతిక సమావేశాల్లో పరిశ్రమ మరియు విద్యా రంగాలకు చెందిన ప్రముఖ నిపుణులు పాల్గొన్నారు. ఓరియెంట్రిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ శ్రీ మహమ్మద్ ముస్తఫా ఖాన్ "AI ఆధారిత తదుపరి తరం మూల్యాంకనం: నమ్మకం, నాణ్యత మరియు సామర్థ్య పెంపు" అనే అంశంపై మాట్లాడి, కృత్రిమ మేధస్సు పరీక్షా వ్యవస్థలను ఎలా మరింత సమర్థవంతంగా, న్యాయబద్ధంగా మార్చగలదో వివరించారు. క్యాంప్‌ఎక్స్ ఎడుటెక్ ప్రైవేట్ లిమిటెడ్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ శ్రీ శ్రీకాంత్ ఎల్లాప్రగడ "డిజిటల్ మూల్యాంకనం: విధానాలు, ప్రయోజనాలు మరియు సవాళ్లు" అనే అంశంపై ప్రసంగించి, ఉన్నత విద్యాసంస్థల్లో డిజిటల్ మూల్యాంకన వ్యవస్థల అమలుకు సంబంధించిన ఉత్తమ పద్ధతులను వివరించారు. చివరి సాంకేతిక సమావేశంలో జేఎన్‌టీయూహెచ్ అకాడెమిక్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్, సీనియర్ ప్రొఫెసర్ వి. కామాక్షి ప్రసాద్ "మూల్యాంకనంలో నాణ్యతా ప్రమాణాల అమలు" అనే అంశంపై ప్రసంగించి, మూల్యాంకన ప్రక్రియల్లో స్థిరత్వం, నిష్పాక్షికత మరియు నాణ్యతా ప్రమాణాల ప్రాముఖ్యతను వివరించారు. దేశవ్యాప్తంగా వివిధ విద్యాసంస్థలకు చెందిన అధ్యాపకులు, పరీక్షల నిర్వాహకులు, విద్యానాయకులు, పరిశోధకులు ఈ వర్క్‌షాప్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పరీక్షా సంస్కరణలు, డిజిటల్ మూల్యాంకనం, నాణ్యత హామీ, AI ఆధారిత పరీక్షా విధానాలపై జరిగిన చర్చలను వారు అభినందించారు. వర్క్‌షాప్ కన్వీనర్ ప్రొఫెసర్ సురేష్ పబ్బోజు, డైరెక్టర్ - అకాడెమిక్ అండ్ ఎగ్జామినేషన్ సెల్ & కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, అతిథులకు స్వాగతం పలికి, వర్క్‌షాప్ లక్ష్యాలను వివరించారు. పరీక్షలు మరియు మూల్యాంకన విధానాల్లో నిరంతర సంస్కరణల అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. సహకన్వీనర్ ప్రొఫెసర్ కె. కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్ (అకాడెమిక్స్) & సిఓఈ , ఉన్నత విద్య అవసరాలకు అనుగుణంగా సాంకేతికత ఆధారిత పరిష్కారాలు మరియు ఉత్తమ పరీక్షా నిర్వహణ పద్ధతులను అమలు చేయాల్సిన అవసరాన్ని వివరించారు. దేశవ్యాప్తంగా వివిధ సంస్థల నుంచి పాల్గొన్న విద్యావేత్తలు మరియు నిర్వాహకుల ఉత్సాహభరిత భాగస్వామ్యాన్ని కన్వీనర్, సహకన్వీనర్ అభినందిస్తూ, ఈ వర్క్‌షాప్‌లో జరిగిన చర్చలు దేశంలోని పరీక్షా మరియు మూల్యాంకన వ్యవస్థల బలోపేతానికి దోహదపడతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. చివరగా జరిగిన ముగింపు సమావేశంలో ఉన్నత విద్యాసంస్థలు పరీక్షా విధానాల బలోపేతం, విద్యా సమగ్రత పరిరక్షణ, నాణ్యతాభివృద్ధి కోసం ఆధునిక సాంకేతికతల వినియోగానికి కట్టుబడి ఉండాలని ప్రతిజ్ఞ చేశాయి.



# ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం

**తోకల శ్రీనివాస్ రెడ్డి**



**రాజేంద్రనగర్, విశాల భారతి** : ఈరోజు రాజేంద్ర నగర్ నియోజకవర్గ పరిధిలోని మైలర్ దేవ్ పల్లి డివిజన్, వాంబే కాలనీ స్థానికుల విజ్ఞప్తి మేరకు బస్తీలోని సమస్యలను పరిశీలించడం జరిగింది. ముఖ్యంగా వేసవి కాలం కారణంగా తలెత్తిన తాగునీటి సమస్యను స్థానికులు రాజేంద్ర నగర్ నియోజకవర్గ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి గారికి తెలియజేశారు. దీనిపై వెంటనే స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యను త్వరితగతిన పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. అదేవిధంగా ఆర్జికె క్వార్టర్స్ పరిధిలో భూగర్భ డ్రైనేజ్ వ్యవస్థ దెబ్బతినడం, పైప్‌లైన్ సమస్యలు, బాల్కనీల మరమ్మతుల వంటి సమస్యలపై కూడా అధికారులతో చర్చించి, వీటిని త్వరలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఇంకా, బస్తీలోని స్థానిక నాయకులకు ప్రజా సమస్యలపై ఎల్లప్పుడూ దృష్టి సారించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పనిచేయాలని సూచించారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా జాగ్రత్తలు పాటించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బుచ్చి రెడ్డి, డివిజన్ మాజీ అధ్యక్షుడు అడికె జనార్ధన్, సంతు గౌడ్, తలారి చిన్న, శ్రీకాంత్ రెడ్డి, లక్ష్మీ , శోభ , బబ్లూ, పృధ్వీరాజ్, అరుణ్ మజర్ భాయ్, ఎన్ను శంకర్ రెడ్డి తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓబీసీ మోర్చా నేతలతో కంచి మహేందర్ కీలక సమావేశం



**కూకట్ పల్లి, విశాలభారతి:** భారతీయ జనతా పార్టీ సంస్థాగత బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై బీజేపీ సీనియర్ నాయకులు కంచి మహేందర్ నివాసంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర, జిల్లా నాయకులతో కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, జిల్లా అధ్యక్షులు మంగేష్ మర్యాదపూర్వకంగా విచ్చేసి కంచి మహేందర్ ని కలిశారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలతో కలిసి బీజేపీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ చేపట్టాల్సిన కార్యక్రమాలు, రాబోయే రోజుల్లో పార్టీ కార్యాచరణ, అలాగే రాష్ట్రంలోని పలు రాజకీయ, సామాజిక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రజలకు మరింత చేరువ కావడం, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, యువత మరియు వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కృషి చేయాలని నేతలు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఓబీసీ మోర్చా నాయకులు వినోద్ గౌడ్, సతీష్ గౌడ్, ఫతేనగర్ డివిజన్ నాయకులు బాలేష్, సురేష్, ఉషారాణి, శివ, అశోక్, చంద్, అరవింద్, కమలాకర్, రమేష్, రఘు, తిల్లు, మణికంఠ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు. నాయకుల పరస్పర సమన్వయం, కార్యకర్తల ఉత్సాహంతో సమావేశం విజయవంతంగా సాగగా, పార్టీ అభివృద్ధి కోసం అందరూ సమిష్టిగా కృషి చేయాలని నిర్ణయించారు.

## నీట్2026 పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 అమలు

**సైబరాబాద్ సీపీ రమేష్ ఉత్తర్వులు**



**సైబరాబాద్ విశాల భారతి :** నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ నీట్ యూజీ 2026 పరీక్ష సజావుగా నిర్వహించేందుకు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ అమలులో ఉంచినట్లు సీపీ డా. ఎం. రమేష్, ఐపీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 21, 2026న జరగనున్న నీట్ పరీక్ష దృష్ట్యా పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల వ్యాసార్థంలో 5 కంటే ఎక్కువ మంది గుమిగూడడాన్ని నిషేధిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు మూసివేయాలని ఆదేశించారు. ప్రశాంత వాతావరణం, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఈ చర్యలు తీసుకుంటున్నట్లు సీపీ తెలిపారు. డ్యూటీలో ఉన్న పోలీస్ అధికారులు, మిలిటరీ సిబ్బంది, హోంగార్డులు, విద్యాశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్, అంత్యక్రియల ఊరేగింపులకు మాత్రమే ఈ నిషేధం వర్తించదు. ఈ ఉత్తర్వులు జూన్ 21 ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అమల్లో ఉంటాయి. ఉత్తర్వులు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ హెచ్చరించింది.

**ప్రజలకు విజ్ఞప్తి:** పరీక్షా కేంద్రాల వద్ద గుంపులుగా ఉండవద్దు. విద్యార్థులకు ఎలాంటి ఆటంకం కలగకుండా సహకరించాలని సీపీ కోరారు.

## గడ్డి మందు తాగి హార్డ్ వేర్ షాప్ యజమాని మృతి



**ఆర్మూర్, విశాలభారతి:** నందిపేట్ మండల కేంద్రానికి చెందిన రాజేష్ హార్డ్ వేర్ షాప్ యజమాని ఎర్రం పవన్ కుమార్ వయస్సు 45 సంవత్సరాలు గురువారం గడ్డి మందు తాగి మృతి చెందినట్లు నందిపేట్ ఎస్ ఐ కె .వినయ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పవన్ హార్డ్వేర్ వ్యాపారంలో నష్టపోయి అప్పులు ఎక్కువ కావడంతో మరియు దుకాణం నుండి సామాను ను కొనుగోలు చేసిన వారు డబ్బులు ఇవ్వకపోవడంతో మనస్థాపం చెంది గురువారం లక్కంపల్లి శివారులో గడ్డి మందు తాగాడు. మెరుగైన చికిత్స కొరకు నిజామాబాద్ లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. భార్య హారిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# గ్రీన్ భద్రాద్రి నూతన కార్యవర్గం ఘనంగా ఎన్నిక

**భద్రాచలాన్ని హరితవనంగా తీర్చిదిద్దడమే లక్ష్యం**

**భద్రాచలం, విశాల భారతి;**

పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్న గ్రీన్ భద్రాద్రి సంస్థ 14వ నూతన కార్యవర్గాన్ని ఘనంగా ఎన్నుకుంది. సంస్థ అధ్యక్షుడిగా ఆర్. రామకృష్ణారెడ్డి, కార్యదర్శిగా భుక్యా రంజిత్ నాయక్, కోశాధికారిగా ఉప్పాడ రాంప్రసాద్ రెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా డాక్టర్ కృష్ణ ప్రసాద్, వీరయ్య, మహిళా విభాగం జాయింట్ కార్యదర్శిగా లక్ష్మీ సావిత్రి, పీఆర్ఓగా సంపత్, లీగల్ అడ్వైజర్‌గా రామరాజు తిరుమలరావు నియమితులయ్యారు. హార్టికల్చర్ అడ్వైజర్లుగా లయన్స్ డాక్టర్ గొల్ల భూపతిరావు, కామిశెట్టి కృష్ణ (పార్క్ కృష్ణ) బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు హాజరయ్యారు. గౌరవ అతిథులుగా భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణదొర, పట్టణ ప్రముఖులు యోగి సూర్యనారాయణ, పాకాల దుర్గాప్రసాద్, భగవాన్ స్వీట్స్ అధినేత శంకర్, పల్లంటి దేశప్ప, క్రెస్ట్ రాజారెడ్డి, చిట్టి లలిత, డాక్టర్ గొల్ల భూపతిరావు, ఉమాశంకర్ నాయుడు, పార్క్ కృష్ణార్జునరావు, బొలిశెట్టి రంగారావు, చింతిరియాల రవికుమార్, పరమి సోమశేఖర్, సోమరులు శ్రీనివాసరావు, జక్కి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ భద్రాచలం పుణ్యక్షేత్రం మాత్రమే కాకుండా పచ్చదనానికి ప్రతీకగా నిలవాలని ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. యువ నాయకత్వంతో ఏర్పడిన గ్రీన్ భద్రాద్రి నూతన కార్యవర్గం భద్రాచలాన్ని మరింత హరితవనంగా తీర్చిదిద్దాలని సూచించారు. పట్టణ ప్రముఖులు యోగి సూర్యనారాయణ మాట్లాడుతూ సమాజ సేవతో పాటు పర్యావరణ పరిరక్షణలో గ్రీన్ భద్రాద్రి చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం ద్వారా నిజమైన పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. భగవాన్ స్వీట్స్ అధినేత శంకర్ మాట్లాడుతూ భద్రాచలం వంటి పవిత్ర క్షేత్రంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు గ్రీన్ భద్రాద్రి చేపడుతున్న కార్యక్రమాలు ఆదర్శప్రాయమని కొనియాడారు. సంస్థ చేపట్టే ప్రతి కార్యక్రమానికి తమ పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం నూతన అధ్యక్షుడు ఆర్. రామకృష్ణారెడ్డి, కార్యదర్శి భుక్యా రంజిత్ నాయక్, కోశాధికారి ఉప్పాడ రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ 202627 సంవత్సరాన్ని భద్రాచలం చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించుకునే విధంగా భారీ ఎత్తున వృక్షారోపణ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రజల సహకారంతో వేలాది మొక్కలు నాటి భద్రాచలాన్ని మరింత పచ్చదనంతో నింపేందుకు కృషి చేస్తామని చెప్పారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి పుణ్యక్షేత్రంగా ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిందని, అలాంటి పవిత్ర క్షేత్రంలో పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే మహోన్నత వృక్షారోపణ కార్యక్రమాలను విజయవంతం చేయడం తమ ప్రధాన లక్ష్యమని నూతన కార్యవర్గం పేర్కొంది. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి గ్రీన్ భద్రాద్రిని ప్రజలకు మరింత చేరువ చేస్తామని సభ్యులు తెలిపారు.



# కరకగూడెం మండలంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు



**విశాల భారతి న్యూస్ రాళ్ళ వాగు పెద్దమ్మ తల్లి గుడి వద్ద, కరకగూడెం మండలం**

**జిల్లా: భద్రాద్రి కొత్తగూడెం**

పినపాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీకి కరకగూడెం మండలంలో మరింత బలం చేకూరింది. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. కరకగూడెం మండలంలోని రాళ్లవాగు పెద్దమ్మ తల్లి గుడి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇక్బాల్ హుస్సేన్ ఆధ్వర్యంలో కన్నాయిగూడెం గ్రామపంచాయతీకి చెందిన ఇండిపెండెంట్ ప్రజాప్రతినిధులు సర్పంచ్ కల్తీ విజయ్, ఉప సర్పంచ్ స్వర్ణలత, నలుగురు వార్డు సభ్యులతో పాటు 25 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని పార్టీలో చేరారు. అలాగే బట్టుపల్లి గ్రామపంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు ఆవుదొడ్డి శ్రీనివాస్, రామారావు మాటూరి, ఉప్పలి నాగేష్, మాటూరి బాబు తదితరులతో పాటు 15 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరి తమ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కొత్తగా పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై విశ్వాసంతో ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు ఆకర్షితులవుతున్నారని అన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, పినపాక నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇక్బాల్ హుస్సేన్ మాట్లాడుతూ కరకగూడెం మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఇక్బాల్ హుస్సేన్, జిల్లా నాయకులు ఎర్ర సురేష్, ముఖ్య నాయకులు రాందాస్ నాయక్, జలగం కృష్ణ, కన్నాయిగూడెం గ్రామ పెద్దలు కోడెం నాగేశ్వరావు, ఓకే కేశవరావు, కలం లక్ష్మయ్య, కలం నాగేశ్వరావు, ఇరప బుచ్చయ్య, ఇరప వెంకటనరసయ్య, కలం నరసయ్య, కలం సాగర్, కలం సాంబమూర్తి, తోలం రమేష్, కోడెం రామారావు, ఓకే గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షా కాల ట్రాఫిక్‌పై ఐటీ సంస్థలతో పోలీస్, మున్సిపల్ కమిషనర్ల సమీక్ష



**కమిషనరేట్‌లో వర్షా కాల ట్రాఫిక్ నిర్వహణపై ఐటీ సంస్థల ప్రతినిధులకు సూచనలు ఇస్తున్న పోలీస్ కమిషనర్ రమేష్, సిఎంసి కమిషనర్ శ్రీజన**

**సైబరాబాద్ విశాల భారతి:** వర్షాకాలంలో ట్రాఫిక్ నిర్వహణ, ఉద్యోగుల భద్రతపై శుక్రవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో సమన్వయ సమావేశం జరిగింది. సైబరాబాద్ పోలీస్ కమిషనర్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సంయుక్తంగా ఐటీ సంస్థలు, బిజినెస్ పార్కులు, వాణిజ్య సంస్థల ప్రతినిధులతో చర్చించారు. భారీ వర్షాల సమయంలో ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు ఉద్యోగుల బస్సు సర్వీసులు పెంచాలని, మెట్రో, ప్రజా రవాణా వినియోగాన్ని ప్రోత్సహించాలని, వ్యక్తిగత వాహనాల వినియోగం తగ్గించాలని సూచించారు. ప్రతికూల వాతావరణ సమయంలో ఉద్యోగుల లాగిన్‌లాగౌట్ సమయాలు సమీక్షించాలని, దశలవారీ కార్యాలయ సమయాలు అమలు చేసి పీక్ అవర్ ఒత్తిడి తగ్గించాలని నిర్ణయించారు. షటిల్, బస్సు సర్వీసుల విస్తరణపైనా చర్చించారు. వర్షాకాలంలో ట్రాఫిక్ అంతరాయాలకు ముందస్తు ప్రణాళికలు అవసరమని పోలీస్ కమిషనర్ చెప్పారు. ఐటీ కారిడార్లలో పెండింగ్ వర్షాకాల మౌలిక వసతుల పనులు వేగంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ అధికారులను ఆదేశించారు. సాఫీ ట్రాఫిక్, సురక్షిత ప్రయాణం కోసం పౌర సంస్థలు, ట్రాఫిక్ విభాగం, పరిశ్రమల మధ్య సమన్వయం కీలకమని ఇరువురు కమిషనర్లు నొక్కి చెప్పారు.

# కూకట్ పల్లి జోన్‌లో ఫిర్యాదుల పరిష్కారానికి కమిషనర్ ఫోకస్

**పౌర సేవలు మెరుగుపరచాలని అధికారులకు ఆదేశం**



**సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సిఎంసి కమిషనర్ శ్రీజన**

**సైబరాబాద్ విశాల భారతి:** కూకట్‌పల్లి జోన్ పరిధిలో పౌర సేవలు, పారిశుద్ధ్యం, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, అభివృద్ధి పనులపై శుక్రవారం జోనల్ స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్, అన్ని సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు పాల్గొన్నారు. సమావేశంలో వివిధ శాఖల పనితీరును కమిషనర్ సమీక్షించారు. ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదుల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై నిరంతర పర్యవేక్షణ, ఫాలోఅప్ తప్పనిసరి అని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, పౌరులు కోరిన ఇంజనీరింగ్ పనులకు ప్రాధాన్యం ఇచ్చి, నిర్ణీత గడువులో అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనులు, క్షేత్రస్థాయి కార్యకలాపాలను అధికారిక సోషల్ మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. పారిశుద్ధ్య సేవలకు అంతరాయం రాకుండా ఖాళీలను త్వరగా భర్తీ చేయాలని, మున్సిపల్ ఆస్తులు, ఖాళీ స్థలాలు, ప్రజా మౌలిక వసతుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, భవన అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని, హోటళ్లు, రెస్టారెంట్లు, క్లౌడ్ కిచెన్లలో ఆహార భద్రతా తనిఖీలు క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. పౌర సేవల మెరుగుదలకు క్షేత్రస్థాయి పర్యవేక్షణ, సకాలంలో పనుల అమలు, శాఖల మధ్య సమన్వయం అవసరమని కమిషనర్ అన్నారు.

# శంషాబాద్‌లో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్

**రాజేంద్రనగర్, విశాల భారతి :** రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రాజెక్ట్‌లో భాగంగా శంషాబాద్‌లో భారీ విద్యాసంస్థ నిర్మాణానికి చర్యలు వేగవంతమయ్యాయి. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని శంషాబాద్ మండలం చౌదరిగుడా గ్రామంలో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్ స్థలాన్ని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ శుక్రవారం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా స్కూల్ నిర్మాణానికి అవసరమైన మౌలిక వసతులు, ముఖ్యంగా రోడ్డు కనెక్టివిటీపై అధికారులతో ఎమ్మెల్యే సమగ్రంగా చర్చించారు. స్కూల్‌కు వెళ్లే అప్రోచ్ రోడ్డు సమస్యను వెంటనే పరిష్కరించేందుకు ఆయన చొరవ చూపారు. రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న స్థానిక రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ భూమి కేటాయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే హామీతో రైతులు సానుకూలంగా స్పందించడంతో రోడ్డు సమస్య సుఖాంతమైంది. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# బీజేపీ బలోపేతమే లక్ష్యం.. బూత్ స్థాయిలో సమన్వయంతో పనిచేయాలి

**రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు**



**విశాల భారతి , అబ్దుల్లాపూర్‌మెట్ :** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ హాల్‌లో ఎస్.ఐ.ఆర్ (Special Intensive Revision) అవగాహన సదస్సు, ఎల్‌బీ నగర్ నియోజకవర్గ బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ పాల్గొని పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. పార్టీ సంస్థాగత బలోపేతం, బూత్ స్థాయిలో కార్యాచరణను మరింత సమర్థవంతంగా నిర్వహించడం, ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియలో కార్యకర్తల పాత్ర వంటి అంశాలపై వారు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని, బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అంకితభావంతో కృషి చేయాలని నాయకత్వం పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర నాయకులు మర్రి శశిధర్ రెడ్డి, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఎల్‌బీ నగర్ నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు మాజీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సామ రంగా రెడ్డి, ,కొత్త రవీందర్ గౌడ్, భాస్కర్, చింతల సురేందర్ యాదవ్ ,బూత్ లెవెల్ ఏజెంట్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నెంబర్ ప్లేట్ లేని వాహనదారులకు కౌన్సిలింగ్



**భద్రాచలం, విశాల భారతి;** భద్రాచలంలో నెంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న ద్విచక్ర వాహన దారులకు కౌన్సిలింగ్ ఇచ్చిన ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతి గత కొన్ని రోజులుగా నెంబర్ ప్లేట్లు లేకుండా ద్విచక్ర వాహనాలను తిప్పుతున్న వాహనదారులను ఈరోజు ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతి పట్టుకొని కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం నెంబర్ ప్లేట్లు లేని ద్విచక్ర వాహనాలకు దగ్గర ఉండి నెంబర్ ప్లేట్లు వేపించారు. చాలా వాహనాలకు ట్రాఫిక్ చలానాలు పెండింగ్లో ఉండి అలాగే తిరుగుతున్న వాహనదారులకు ట్రాఫిక్ చలానాలను కట్టిపించారు.

## కేపీహెచ్‌బీ మెట్రో వద్ద వాటర్ లాగింగ్ తొలగింపు



రోడ్డుపై వాటర్ లాగింగ్ తొలగింపు పనులను పరిశీలిస్తున్న అధికారులు. హైడ్రా బృందం పూడిక తీస్తున్న దృశ్యం

**సైబరాబాద్ విశాల భారతి:** ఆల్విన్ కాలనీ సర్కిల్ 51 పరిధిలో కేపీ హెచ్‌బీ మెట్రో స్టేషన్ నుంచి అల్లూరి ట్రేడ్ సెంటర్ వరకు ఉన్న రహదారిపై నిలిచిన వర్షపు నీటిని హైడ్రా బృందంతో కలిసి డీసీ ఇ.చాముండేశ్వరి సమన్వయం చేసి తొలగించారు.గురువారం కురిసిన వర్షానికి ఈ ప్రాంతంలో వాటర్ లాగింగ్ ఏర్పడి వాహనదారులకు ఇబ్బందులు కలిగాయి. సమాచారం అందుకున్న డీసీ ఆల్విన్ కాలనీ సర్కిల్ 51 అధికారులు వెంటనే స్పందించారు. హైడ్రా టీమ్ సహకారంతో డ్రైనేజీ మ్యాన్‌హోల్స్, అవుట్‌లెట్స్‌ను శుభ్రం చేసి నీరు వేగంగా బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టారు. రహదారిపై నీరు నిల్వ లేకుండా, రాకపోకలకు ఆటంకం లేకుండా పూడిక తీత పనులు పూర్తి చేశారు. భవిష్యత్తులో వర్షాల సమయంలో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కార చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## ఆల్విన్ కాలనీ సర్కిల్ 51లో వాటర్ స్టాగ్నేషన్ పరిశీలన



**సైబరాబాద్ విశాల భారతి :** ఆల్విన్ కాలనీ సర్కిల్ 51 భాగ్యనగర్ డివిజన్ లోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ జంక్షన్ వద్ద నిలిచిపోతున్న వర్షపు నీటిని మియాపూర్ సర్కిల్ 51 డీసీ ఈ.చాముండేశ్వరి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ ప్రాంతంలో నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. సమస్యను గుర్తించి వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాంట్రాక్టర్‌తో కలిసి డీసీ ఆ ప్రదేశాన్ని సందర్శించారు. నీరు బయటకు వెళ్లేందుకు అవుట్‌లెట్ గుర్తించడం, డ్రైనేజీ లైన్‌కు అనుసంధానం చేయడం, రోడ్డుపై నిల్వ లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. రాకపోకలకు ఆటంకం లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కాంట్రాక్టర్‌కు ఆదేశాలు ఇచ్చారు. స్థానిక సిబ్బంది వెంట ఉన్నారు. త్వరలో సమస్య పరిష్కారమవుతుందని డీసీ తెలిపారు.

## శుభోదయ కాలనీలో డ్రైనేజీ సమస్యల పరిశీలన

**మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు,అధికారులతో కలిసి పర్యటన**



శుభోదయ కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

**సైబరాబాద్ విశాల భారతి:** హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని శుభోదయ కాలనీలో డ్రైనేజీ సమస్యలపై మాజీ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు.శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ ఆదేశాల మేరకు ఆయన జలమండలి అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. డ్రైనేజీ లైన్ పూడికపోవడం, మురుగునీరు రోడ్లపైకి రావడంపై స్థానికుల ఫిర్యాదులు అందడంతో స్పందించారు. జలమండలి మేనేజర్ ప్రకాష్ విలియమ్స్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేందర్‌తో కలిసి ప్రతి వీధిని తిరిగి మ్యాన్‌హోల్స్, లైన్లను పరిశీలించారు. పూడిక తీత, లీకేజీల నివారణపై అధికారులకు సూచనలు చేశారు. కాలనీ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు.అధికారులు తక్షణమే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీ సంక్షేమ సంఘ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య బోధన

**ఎంపీడీవో ముత్యాలరావు**




**అశ్వాపురం, విశాలభారతి:** ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్యాబోధన లభిస్తుందని, బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించి విద్యాబుద్ధులు నేర్పించాలని ఎంపీడీవో ముత్యాలరావు అన్నారు. శుక్రవారం మండలంలోని నెల్లిపాక బంజర గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఆయన పలువురు విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలలో ప్రభుత్వం మెరుగైన వసతులు కల్పిస్తూనే నాణ్యమైన విద్యా బోధనను అందిస్తుందన్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయుల చేత పాఠ్యాంశాలను బోధిస్తూ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్ లతో పాటు మెరుగైన మధ్యాహ్న భోజన వసతిని అందజేస్తుందన్నారు. బంజర ప్రభుత్వ పాఠశాల పరిసరాలలో ఉన్న గ్రామాలలోని పిల్లలను ఇక్కడ చేర్పిస్తే వారి రవాణా కోసం కూడా స్థానికంగా ఉన్నవారు ఆటో సౌకర్యం కూడా కల్పించాలని ఆయన తెలిపారు. ప్రభుత్వ బడులలో చదువుకున్న విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆయన అన్నారు.

## ప్రకృతిని రక్షిద్దాం..భావితరాలకు ప్రాణవాయువును అందిద్దాం

**పిచరాగడి తాండ సర్పంచ్ : రామావత్ భీమి బాయి**

**జహీరాబాద్:** వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమ లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించాలని పిచరాగడి తాండ సర్పంచ్ రామావత్ భీమి బాయి పిలుపునిచ్చారు. శుక్రవారం కోహిర్ మండలంలోని పిచరాగడి పాత తాండలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వన మహోత్సవం 2026 కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కోహిర్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు రాథోడ్ వినోద్ కుమార్,పంచాయతీ కార్యదర్శి అక్తర్,పాఠశాల ఉపాధ్యాయురాలు మీనాక్షి,ఫీల్డ్ అసిస్టెంట్ క్రిస్టోఫర్,వార్డు సభ్యులు రాథోడ్ రవీన సంజీవ్ కుమార్,చౌహన్ అనూష బాయి,కాంగ్రెస్ నాయకులు రామావత్ గోపాల్ నాయక్, కేతావత్ లక్ష్మణ్, నాగిశెట్టి,పారశురాం, పాల్గొని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా సర్పంచ్ రామావత్ భీమి బాయి మాట్లాడుతూ.. మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో పర్యావరణ సమతుల్యాన్ని కాపాడటం అత్యంత ఆవశ్యకం అని పేర్కొన్నారు. భావితరాలకు ఆరోగ్యకరమైన జీవనాన్ని, సహజ సిద్ధమైన ప్రాణవాయువును అందించేందుకే ఈ వన మహోత్సవం ద్వారా విస్తృతంగా మొక్కలు నాటుతున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలంటే కేవలం అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రమే కాకుండా, ప్రతి ఒక్కరూ తమ వంతు సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలని కోరారు. అలాగే నాటిన ప్రతి మొక్కనూ కంటికి రెప్పలా సంరక్షించుకోవాలని గ్రామస్తులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మహిళలు గ్రామస్తులు పాల్గొని మొక్కలు నాటారు.



# నిజాయితీ, వృత్తి నైపుణ్యమే ఫారెస్టు అధికారుల గుర్తింపు







- తెలంగాణ పీసీసీఎఫ్ డాక్టర్ సి. సువర్ణ
- ఫారెస్టు అకాడమీలో 12వ బ్యాచ్ ఎఫ్ఆర్ఓల ట్రైనింగ్ షురూ

**హైదరాబాద్- విశాల భారతి :**

తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ అకాడమీ (టీఎస్ఎఫ్ఏ) దూలపల్లిలో 12వ బ్యాచ్ అటవీ క్షేత్రస్థాయి అధికారుల (ఎఫ్ఆర్వో) ప్రవేశ శిక్షణ కార్యక్రమం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. 18 నెలల పాటు కొనసాగే ఈ శిక్షణ కార్యక్రమంలో ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కేరళ రాష్ట్రాలకు చెందిన 58 మంది శిక్షణార్థులు పాల్గొన్నారు. అటవీ నిర్వహణ, జీవవైవిధ్య పరిరక్షణ, వన్యప్రాణి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా భవిష్యత్ అటవీ అధికారులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రధాన అటవీ సంరక్షణాధికారిణి (హెచ్ఓఎఫ్ఎఫ్) డాక్టర్ సి. సువర్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అటవీ అధికారులు దేశ అటవీ సంపదకు, సహజ వనరులకు తొలి కాపలాదారులని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు ప్రకృతి సంపదను అందించడంలో అటవీ అధికారుల పాత్ర ఎంతో కీలకమని చెప్పారు. తమ విధుల్లో నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణ, వృత్తి నైపుణ్యం, ప్రజాసేవా దృక్పథం ప్రతిబింబించాలని శిక్షణార్థులకు సూచించారు. అటవీ సంరక్షణ మాత్రమే కాకుండా జీవవైవిధ్య పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, అటవీ చట్టాల అమలు, పర్యావరణ పరిరక్షణ, స్థానిక సమాజాలతో సమన్వయం వంటి బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. అటవీ రంగంలో వస్తున్న కొత్త సవాళ్లను ఎదుర్కోవాలంటే నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. దేశంలో అటవీ సంపద పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత కాపాడడంలో శిక్షణ పొందిన, అంకితభావం కలిగిన అధికారులు కీలక పాత్ర పోషిస్తారని ఆమె తెలిపారు. తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ ప్రియాంకా వర్గీస్ మాట్లాడుతూ స్థానిక ప్రజల అవసరాలను అర్థం చేసుకుంటూ అటవీ సంరక్షణలో ముందుండే సమర్థ అధికారులను తీర్చిదిద్దడమే అకాడమీ లక్ష్యమని చెప్పారు. 18 నెలల శిక్షణ కాలాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకొని అటవీ వ్యవస్థలు, జీవవైవిధ్యం, క్షేత్రస్థాయి పరిపాలన, సంరక్షణ పద్ధతులపై సమగ్ర అవగాహన పెంపొందించుకోవాలని శిక్షణార్థులకు సూచించారు. నేటి అటవీ పరిపాలనలో శాస్త్రీయ పరిజ్ఞానం, క్షేత్రస్థాయి అనుభవం, నాయకత్వ లక్షణాలు, ప్రజలతో సమన్వయం ఎంతో అవసరమని ఆమె పేర్కొన్నారు. నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు సాంకేతికత, ఆవిష్కరణలను స్వీకరించి పర్యావరణ పరిరక్షణకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ శిక్షణ ద్వారా ఆధునిక కాలంలో అటవీ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే నైపుణ్యాలు పెంపొందుతాయని ఆమె తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అటవీ పరిపాలన, అటవీ నిర్వహణ, వన్యప్రాణి సంరక్షణ, అటవీ నేరాల నివారణ, జీవవైవిధ్య పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ, స్థానికంగా నివసించే వర్గాల ఆధారిత అటవీ నిర్వహణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వంటి అంశాలపై విస్తృతంగా శిక్షణ అందించనున్నారు. అటవీ సంపద సంరక్షణతో పాటు అటవీ ప్రాంతాలపై ఆధారపడే ప్రజల అవసరాలను సమన్వయం చేసుకుంటూ పనిచేసే సమర్థ అధికారులను తయారు చేయడమే దీని ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ప్రధాన అటవీ సంరక్షణాధికారి (పరిపాలన) డాక్టర్ ఎస్.జె. ఆశా కూడా శిక్షణార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అటవీ సేవల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన విధి నిర్వహణ ప్రాధాన్యంపై ఆమె పలు సూచనలు చేశారు. అనంతరం శిక్షణార్థులు, సీనియర్ అటవీ అధికారుల మధ్య పరస్పర చర్చా కార్యక్రమం నిర్వహించారు. అటవీ సేవల్లో ఉన్న అవకాశాలు, బాధ్యతలు, సవాళ్లపై అధికారులు శిక్షణార్థులకు అవగాహన కల్పించారు. శిక్షణ పూర్తయిన అనంతరం శిక్షణార్థులు తమ తమ రాష్ట్రాల్లోని వివిధ అటవీ విభాగాల్లో విధులు నిర్వహించనున్నారు. అటవీ సంరక్షణ, జీవవైవిధ్య పరిరక్షణ, వన్యప్రాణి నిర్వహణ, పర్యావరణ పరిరక్షణలో వారు కీలక పాత్ర పోషించనున్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్, కోర్స్ డైరెక్టర్ జి.బి. రేఖాభాను, అదనపు కోర్స్ డైరెక్టర్ సాహు, అసిస్టెంట్ కోర్స్ డైరెక్టర్ భూమా కున్వర్, అధ్యాపకులు, అకాడమీ సిబ్బంది పాల్గొన్నారు.

# పబ్లిక్ టాక్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి ది "లీడర్"

- మీసం ఉన్న నేస్తమా నీకు సేవ గుణం ఎక్కువ
- 2006-26వరకు అలుపెరగని ప్రజా సేవ
- సమాజానికి బాధ్యత గల నాయకుడు కావాలి



**బూర్గంపాడు, విశాలభారతి:**

బూర్గంపాడు లక్ష్మీపురం గ్రామానికి చెందిన పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి మాజీ సర్పంచ్ లక్ష్మీపురం. మృదుస్వభావి, జననేత, స్నేహశీలి 200626 వరకు ప్రజాసేవలో అలుపెరగని సేవకుడు, ఆపదలో ఉన్నవారికి ఆపద్బాంధవుడు. తన జీవితం తెరిచిన పుస్తకం తను నమ్మిన ప్రజల కోసం '2' దశాబ్దాలుగా ఎన్నో ఆటుపోటులను ఎదుర్కొంటూ నేనున్నాను అంటూ భరోసా కల్పిస్తున్న ది లీడర్. తన అనుకున్న వాళ్లే తనను రాజకీయంగా తొక్కేయాలనుకున్న అదరడు ,బెదరడు , విక్రమార్కుడిలా మీసం మీద చెయ్యేసి మెలితిప్పితే ఎంతటి వారైనా ఆయన ముందు బలాదూరే. మంచికి మనసున్న మరాజు, అభివృద్ధిలో రారాజు. సమస్య ఏదైనా మాటిస్తే మడమతిప్పడు మాట తప్పడు. సమాజం బాగుండాలంటే సరైన నాయకత్వ లక్షణాలున్న ఇలాంటి నాయకులు కావాలి. నాయకత్వం అంటే పదవుంటేనే వచ్చేది కాదు. సమాజంలో పదిమందికి పనికొచ్చే లక్షణం మీ దగ్గర ఉంటే మీ ఆలోచన కానీ, మీ ప్రవర్తన కానీ మీ నైపుణ్యంలో కానీ సహజంగా నాయకత్వం వస్తుంది. నాయకత్వం అనేది కోరుకుంటేనో కొనుక్కుంటేనో వచ్చేది కాదు. వద్దన్నా కూడా పదిమంది మీ దగ్గరికి వచ్చి వారి అవసరాన్ని తీర్చుకోవడాన్నే నాయకత్వం లక్షణం అంటారు. అందుకేనేమో పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి కి అంత ఆదరణ బూర్గంపాడు మండలలో ప్రజలు మెచ్చిన లీడర్.

## శ్రీ రామచంద్ర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ లెర్నింగ్ శిక్షణ ప్రారంభం




**పాల్వంచ విశాల భారతి:** తెలంగాణ ప్రభుత్వం, ఉన్నత విద్యాశాఖ కలిసి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్న అక్క మెంటార్షిప్ ప్రోగ్రాంలో భాగంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పి. పద్మ అధ్యక్షతన శ్రీ రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులకు, విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు డిజిటల్ లెర్నింగ్ లలో రెండు రోజుల శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణ తరగతులకు అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మరియు మాస్టర్ ట్రైనర్ డాక్టర్ ఎ. అవని , డిప్లొమా ప్రిన్సిపాల్ డాక్టర్. బి. రవి కుమార్, పాల్గొని విద్యార్థులకు మరియు అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు చదువుకుంటూనే పాఠశాల విద్యార్థులకు కృత్రిమ మేధస్సు పాఠాలను బోధించడం ఒక గొప్ప అభ్యసన ప్రక్రియ అని, తాము నేర్చుకొని ఇతరులకు బోధించడం వలన విద్యార్థులు కృత్రిమ మేధ అంశాలపై పట్టు సాధిస్తారని తెలిపారు. దీనిలో భాగంగా సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి అనేక రంగాలలో ఏ విధంగా నైపుణ్యాలు సంపాదించాలి అనే అంశాలను తెలియచేశారు. ఈ అవకాశాన్ని డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు 15 రోజులపాటు రోజుకు రెండు గంటల చొప్పున 30 గంటలు దగ్గరలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఆరు నుంచి 10 వ తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థినీ విద్యార్థులకు ఈ కృత్రిమ మేధ అంశాలను బోధించవలసి ఉంటుంది. దీనికిగాను వీరికి రెండు క్రెడిట్ మార్కులు కేటాయించబడుతున్నాయి. దానితో పాటు సర్టిఫికెట్ కూడా ఇవ్వడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా అనుబోస్ కళాశాల కంప్యూటర్ సైన్స్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ ఎన్. సుష్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ కె. సౌమ్య, వి. కళ్యాణి శిక్షణ ఇచ్చారు మరియు ఎం డి. ఫిరోజ్ సాంకేతిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల నోడల్ అధికారులైన గణిత విభాగాధిపతి శ్రీమతి పి. అనురాధ, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ ఎ. వెంకటేశ్వర్లు , మరియు ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ ఎన్ . అనిత పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్ర మంలో విద్యార్థులతోపాటు వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. పూర్ణచంద్రరావు, కెమిస్ట్రీ విభాగాధిపతి డా. కె. వనజ, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జి. మధు, డా. సునీత, డా ఎన్. విద్యా ప్రవీణ, అంజని, అరుణ, వెంకట రమణ, లక్ష్మీనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శివజ్యోతి, చక్రవర్తి, , దిలావర్, సైదులు, కార్తీక్ పాల్గొన్నారు.


## ఐదుకు ముందే ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం క్లోజ్

**నిర్లక్ష్యం మాటున కార్యాలయ నిర్వహణ**




**విశాల భారతి, భద్రాద్రి ప్రతినిధి :** బూర్గంపాడు మండలంలోని మోరంపల్లి బంజర లో గల ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఐదుకు ముందే క్లోజ్ అవుతోందని చెబుతున్నారు. ప్రాజెక్టు కార్యాలయం నిర్లక్ష్యపు నీడన కొనసాగుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. శుక్రవారం అక్కడ పనిచేస్తున్న అధికారులందరూ జిల్లా కేంద్రంలోని ప్రాజెక్టు కార్యాలయంలో చేపట్టిన కొన్ని ప్రత్యేకమైన పనులు చేపట్టేందుకు వెళ్లినట్లు తెలుస్తుండగా కార్యాలయంలో ఉండాల్సిన కొందరు సిబ్బంది సమయపాలన పాటించకుండానే ఐదు గంటలకు ముందే కార్యాలయానికి తాళాలు వేసుకొని వెళ్లడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం ఐదు గంటల వరకు అటెండర్ కూడా కార్యాలయంలో ఉండకుండా తాళాలు వేసుకొని వెళ్లిపోవడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఆ శాఖ అధికారులు స్పందించి ప్రాజెక్టు కార్యాలయంలోని ఉద్యోగులు సమయపాలన పాటించడంలో చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ కేసులు నమోదు ఏడూళ్ళ బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు



**విశాల భారతి :** కరకాగూడెం మండలం లో నకిలీ విత్తనాలను రైతులకు అమ్మితే పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని ఏడూళ్ళ బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని పలు ఫర్టిలేజర్ షాపులను సీఐ వెంకటేశ్వరరావు, కరకగూడెం ఎస్ఐ పీవీ ఎన్ రావు తనిఖీలు చేశారు..

## చిన్నారుల ఆరోగ్యం, ఆనందమే అసలైన అభివృద్ధి : మంత్రి సీతక్క




**విశాల భారతి, చార్మినార్ :** చాంద్రాయణగుట్ట నియోజకవర్గ పరిధిలోని అరుంధతి నగర్‌లో అంగన్వాడీ కేంద్రం కమ్‌పాలన (డే కేర్) కేంద్రాన్ని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు యూనిఫాంలు పంపిణీ చేసి, వారి అభ్యాస ప్రదర్శనలను వీక్షించి అభినందించారు. అనంతరం లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా బోయ కార్పొరేషన్ వైస్ చైర్మన్ బోయ నగేష్ ఆధ్వర్యంలో చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో తొలి పాలన కేంద్రాన్ని చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు సంరక్షణ, పోషకాహారం, ఆటల ద్వారా అభ్యాసం అందించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని తెలిపారు. వేల రూపాయలు ఖర్చు చేసి ప్రైవేట్ నర్సరీల్లో చేర్పించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం ప్రజల ఇంటి వద్దకే నాణ్యమైన సేవలను తీసుకువచ్చిందన్నారు. అంగన్వాడీ కేంద్రం, పాలన కేంద్రాన్ని ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేయడం ద్వారా ఒకే కుటుంబంలోని చిన్నారులందరికీ సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఉపాధి కోసం బయటకు వెళ్లే తల్లులకు ఈ డే కేర్ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని, పిల్లల సంరక్షణ కోసం మహిళలు తమ ఉద్యోగాలు, ఉపాధిని వదులుకోవాల్సిన పరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వం భరోసా కల్పిస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు చిన్నారుల సంరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా పాలన కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల వరకు చిన్నారులను ఈ కేంద్రాల్లో ఉంచి వారి సంరక్షణ బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఆటవస్తువులు, అభ్యాస సామగ్రి, పోషకాహారం అందుబాటులో ఉంచామని చెప్పారు. చిన్నారి జీవితంలోని మొదటి వెయ్యి రోజులు అత్యంత కీలకమైనవని, ఆ దశలో మెదడు ఎదుగుదలతో పాటు శారీరక, మానసిక వికాసం జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. అందుకే గర్భధారణ దశ నుంచి తొలి రెండు సంవత్సరాల వరకు తల్లులు, చిన్నారులకు అవసరమైన పోషకాహారం, ఆరోగ్య సేవలు, సంరక్షణ అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. అంగన్వాడీ సేవలను మరింత బలోపేతం చేస్తూ పిల్లలకు విద్యతో పాటు పోషకాహారం, అల్పాహారం కూడా అందిస్తున్నామని తెలిపారు. ప్రైవేట్ నర్సరీలకు దీటుగా అంగన్వాడీ కేంద్రాలను తీర్చిదిద్దుతూ 57 రకాల ఆటవస్తువులు, యూనిఫాంలు, నాణ్యమైన ప్రీస్కూల్ విద్యను అందిస్తున్నామని చెప్పారు. ఆరు సంవత్సరాల లోపు పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. మహిళల సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని, ఇప్పటివరకు రూ.61 వేల కోట్లకు పైగా రుణాలు అందించామని తెలిపారు. లక్ష కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను మహిళలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.



### కాజల్ అగర్వాల్ బర్త్‌డేకు

# బాలయ్య గిఫ్ట్

నందమూరి బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'NBK111' నుంచి మేకర్స్ బిగ్ సర్‌ప్రైజ్ ఇచ్చారు. నేడు హీరోయిన్ కాజల్ అగర్వాల్ పుట్టినరోజు సందర్భంగా ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తూ చిత్రంలో కాజల్ హీరోయిన్‌గా నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. దీంతో గత కొన్ని వారాలుగా ఈ ప్రాజెక్ట్‌పై నెలకొన్న ఊహాగానాలకు ఫుల్‌స్టాప్ పడింది. ఈరోజు విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో కాజల్ సింపుల్ చీరకట్టులో, కళ్లజోడు ధరించి అత్యంత గంభీరంగా కనిపించింది. కార్యాలయ వాతావరణంలో నిలబడి ఉన్న ఆమె లుక్‌లో సీరియస్‌నెస్, పవర్‌ఫుల్ వైబ్ స్పష్టంగా కనిపిస్తోంది. స్టార్ హీరోయిన్‌ను ఇలా డీ-గ్లామర్ లుక్‌లో చూపించడంతో పాత్రపై క్యూరియాసిటీ ఒక్కసారిగా పెరిగింది. పోస్టర్‌తో పాటు చిత్ర బృందం కాజల్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ సినిమా ఆమె కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందని పేర్కొంది. 'భగవంత్ కేసరి' తర్వాత బాలకృష్ణ, కాజల్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రమిది. 'భగవంత్ కేసరి'లో కాజల్ పాత్రకు మంచి పేరు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే 'NBK111'లో మాత్రం ఆమె పూర్తి స్థాయి కథానాయికగా, కథను మలుపు తిప్పే కీలక పాత్రలో కనిపించనుందని ఫిల్మ్ నగర్ వర్గాలు చెబుతున్నాయి. యాక్షన్, ఎమోషన్‌ల మేళవింపుగా భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్ర షూటింగ్ ఇప్పటికే శరవేగంగా జరుగుతోంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.